www.vishalabharati.com
epaper.vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్
19 అక్టోబర్ 2025
సంపుటి:3 సంచిక: 291

# విశాల భారతి


తెలుగు దినపత్రిక



తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ సెంటిమెంట్ రాజకీయాలకు చెక్ పెట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం 'బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్' అస్త్రాన్ని ప్రయోగిస్తే, దానిని బీఆర్ఎస్ పార్టీతో సహా అన్ని పార్టీలు వాడేసుకుంటున్నాయి. ఈ ప్రతిపాదనని సుప్రీంకోర్టు తిరస్కరించడంతో 'బీసీ ఐకాస' శనివారం 'తెలంగాణ బంద్'కు పిలుపునిచ్చింది. త్వరలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు, తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు జరుగబోతున్నాయి.కనుక అధికార కాంగ్రెస్ పార్టీతో సహా అన్ని పార్టీలు ఈ బందిలో పాల్గొంటున్నాయి. ప్రభుత్వం , ప్రతిపక్షాలు కలిసి 'బంద్' చేస్తున్నాయి కనుక సంపూర్ణం, విజయవంతం అవుతుంది.

# బీసీ బ్రహ్మాస్త్రం కోసం పోటీ

## బీఆర్ఎస్ సెంటిమెంట్ పాలిటిక్స్‌కు చెక్




- రిజర్వేషన్ల అస్త్రాన్ని ప్రయోగించిన కాంగ్రెస్
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్ అంశం
- బీసీ ఐకాస బంద్‌కు పిలుపునిచ్చింది
- ప్రభుత్వం , ప్రతిపక్షాలు కలిసి పాల్గొన్నాయి
- చట్ట సవరణ చేయకుండా పెంపు సాధ్యం
- మూడు పార్టీలు బంద్‌ని వాడుకున్నాయి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

పార్లమెంటులో చట్ట సవరణ చేయకుండా బీసీలకు 42 శాతం రి జర్వేషన్స్ పెంపు సాధ్యం కాదనే సంగతి బంద్‌లో పాల్గొంటున్న పార్టీలన్నిటికీ బాగా తెలుసు. అయినా శాసనసభలో ఈ బిల్లుకి ఆమోదం తెలిపాయి. అప్పుడే ఈ పేరుతో రాజకీయాలు మొదల య్యాయి. ఈ బంద్‌తో అవి పరాకాష్టకు చేరాయంతే! బీసీల పట్ల తమకు మాత్రమే చిత్తశుద్ధి ఉందని చాటింపు వేసుకునేందుకే మూడు పార్టీలు ఈ బంద్‌ని వాడుకుంటున్నాయి. పనిలో పనిగా తమ రాజకీయ ప్రత్యర్థులపై పైచేయి సాధించాలని ప్రయత్నిస్తు న్నాయి. ఒకవేళ ఇప్పుడు ఈ ఉప, స్థానిక ఎన్నికలు లేకపోతే మూడు పార్టీలు ఇలా రోడ్లపైకి వచ్చేవా?అంటే కాదనే చెప్పవ చ్చు. కనుక బీసీ రిజర్వేషన్స్ పేరుతో జరుగుతున్న ఈ రాజకీయ ఆదిపత్యపోరులో ఈ మూడు పార్టీలలో ఏదో ఒకటి తప్పక గెలు స్తుంది. కానీ వాటి రాజకీయ చదరంగంలో బీసీలు పావులుగా మిగిలి ఓడిపోతారు. కనుక బీసీ రిజర్వేషన్స్ అంశాన్ని కేవలం ఓ రాజకీయ వ్యూహంగానే చూసినట్లయితే, దీంతో బీసీలను ఆకట్టుకొని బలపడదామని కాంగ్రెస్ పార్టీ అనుకుంది. కానీ ఇప్పుడు అన్ని పార్టీలు దీనిని తమకు అనుకూలంగా మలుచుకొ ని లబ్ది పొందాలని ఆరాటపడుతున్నాయి. ఇది కాంగ్రెస్ పార్టీకి పెద్ద షాక్, ఎదురు దెబ్బే. నిజానికి ఇది కాంగ్రెస్ పార్టీకి జాతీయ స్థాయిలో కూడా బ్రహ్మాస్త్రం వంటిదే. కాంగ్రెస్ అధిష్టానం కూడా ఇది చాలా శక్తివంతమైన

మిగతా 2లో..

# సీఎం సీరియస్

- అధికారుల పనితీరుపై సీఎం అసంతృప్తి
- నిర్లక్ష్య ధోరణిని విడనాడాలని హెచ్చరికలు
- ప్రభుత్వం సహించబోదని స్పష్టం
- సీఎం ఆఫీస్ సెక్రటరీలతో ప్రత్యేక సమావేశం
- గ్రూప్-2కి ఎంపికైన వారికి నియామక పత్రాలు
- గత పాలకులు యువతను వాడుకున్నారు
- సంపదలో నిజాం నవాబులతో పోటీపడ్డారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో నిర్లక్ష్య ధోరణిని విడనాడాలని అన్ని విభాగాల ప్రిన్సిపల్ సెక్రటరీలు, సెక్రట రీలు మరియు డిపార్ట్‌మెంట్ అధిపతులకు హెచ్చరికలు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం కనిపిస్తే ప్రభుత్వం సహించబోదని స్పష్టం చేశారు. కొందరు అధికారుల పనితీరు సరిగా లేకపోవడంపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజాప్రభుత్వం అధికారం లోకి వచ్చి రెండేళ్లు గడిచినా, కొందరు అధి కారులు తమ

మిగతా 3లో..



# మడావి హిడ్మా ఎక్కడ..!

- కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్
- మావోయిస్టుల గుళికల్ని దెబ్బతీస్తోంది
- కీలక నేతలు వరుసగా లొంగిపోతున్నారు
- తాజాగా మడావి హిడ్మా పేరు హాట్ టాపిక్
- స్పెషల్ ఆపరేషన్ చేపడుతున్నట్లు టాక్
- హిడ్మాకు మూడంచెల భద్రతా వ్యవస్థ
- రక్షణగా ఎల్లప్పుడూ 50 మంది సభ్యులు

3

# విల్లాసాల్లో తగ్గేదేలే

## భారీగా పెరిగిన లగ్జరీ ఇండ్లు

- సిటీ తర్వాత
- బెంగుళూరు, పుణే నగరాలు
- సిటీ కేంద్రంగా జోరుగా
- లగ్జరీ ఇండ్ల అమ్మకాలు
- శివారు ప్రాంతాల్లో
- పుష్కళంగా విల్లా ప్రాజెక్టులు




5

# ప్రశాంతంగా ముగిసిన బీసీ బంద్

- బీసీ రిజర్వేషన్ల కోసం తెలంగాణ బంద్
- ఉదయం 4 గంటల నుంచే మొదలు
- బస్సులను బీసీ నేతలు అడ్డుకున్నారు
- కాంగ్రెస్ పార్టీ సహా ప్రతిపక్షాలు మద్దతు
- బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు
- బంద్‌కు మద్దతుగా విద్యాసంస్థలు
- ఎంజీబీఎస్‌లో బస్సులు నిచిపోయాయి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో బీసీ బంద్ ప్రశాంతంగా ముగిసింది. బీసీ రిజర్వేషన్ల కోసం పిలు పునిచ్చిన బీసీ బంద్ శనివారం ఉదయం 4 గంటల నుంచే మొదలైంది. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం రాష్ట్ర బీసీ సంఘాలు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని ఆర్టీసీ డిపోల బయట ఎక్కడికక్కడ బస్సులను బీసీ సంఘాలు నేతలు అడ్డుకున్నారు. తమ బంద్‌కు ప్రజలు సహకరించాలని బీసీ నేతలు కో రుతున్నారు. రాష్ట్రంలో మెడికల్ షాపులు, అంబులెన్సులు వంటి అత్యవసర సేవలు మినహా ఏ సేవలు కూడా అందుబాటులో ఉండకపోయే అవకాశం ఉంది. అటు ఈ బంద్‌కు అధికార కాంగ్రెస్ పార్టీ సహా ప్ర తిపక్షాలు సైతం మద్దతు తెలిపాయి.బీసీ జేఏసీ బంద్‌కు అధికార

మిగతా 2లో..



150 వైన్ షాపులకు దరఖాస్తు

# చేసిన ఏపీ మహిళ

- రాష్ట్రంలో మద్యం దుకాణాలకు దరఖాస్తులు
- గడువు శనివారంతో ముగిసింది
- టెండర్లకు అనూహ్యంగా స్పందన తగ్గింది

2


# బీసీ ఉద్యమం ఇక్కడితో ఆగదు

- బీసీలు హక్కుల సాధన వ్యవహారం
- తెలంగాణ బంద్ పిలుపు ఇచ్చాయి
- ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు



2

# బీహార్ ఎన్నికల్లో బ్రహ్మోస్




- రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్
- బ్రహ్మోస్ క్షిపణి తయారీ కేంద్రంలో పర్యటన
- క్షిపణులను భారత్ ఆర్మీకి అప్పగించారు
- వాటి నుంచి పాక్ తప్పించుకోలేదు
- ఆపరేషన్ సింధూర్ ట్రైలర్ మాత్రమే
- నవంబర్ 6, 14 తేదీలలో బీహార్ ఎన్నికలు
- బీహార్ ముఖ్యమంత్రి పదవి బీజేపిదే
- ఎన్నికల కోసం బ్రహ్మోస్ వాడాలనే ఆలోచన

2

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
త్వరలో వెలువడనున్న విశాల భారతి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా
( వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్)
టాబ్లాయిడ్ కోసం విలేకరులు కావలెను...
- అక్షరానికి పదును పెట్టి ఉన్నది ఉన్నట్లుగా రాసేవారికి ప్రాధాన్యత.
- ప్రత్యేకంగా టాబ్లాయిడ్ కోసం పనిచేసే వాళ్లు కావలెను.
- అనుభవం ఉన్నవారికి ప్రియారిటీ ఇవ్వబడును
- హైదరాబాద్ కోసం ఈ క్రింది డేట్ లైన్లలో విలేకరులు కావలెను...

ఖైరతాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్,
సనత్ నగర్, పంజాగుట్ట, రాణిగంజ్,
ట్యాంక్‌బండ్, ధర్నా చౌక్, బషీర్‌బాగ్, కోఠి, నాంపల్లి,
మెహిదీపట్నం, చార్మినార్, లకిడీకపూల్.
సంప్రదించవలసిన నెంబర్:
93989 08071
వివరాల కోసం: epaper.vishalabharati.com

# కవిత వారసుడు పొలిటికల్ ఎంట్రీ

- రాష్ట్ర రాజకీయాల్లో కేసీఆర్ కుటుంబం
- మరో తరం రాజకీయ ఎంట్రీ ఖాయం
- జాగృతి సంస్థ అధ్యక్షురాలిగా కవిత
- బీసీ బంద్‌లో కవిత కుమారుడు ప్రత్యక్షం
- ఒక్క సారిగా రాజకీయ చర్చ అటు
- రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు
- షర్మిల కుమారుడు సైతం రాజకీయాల్లోకి




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్ కుటుంబం నుంచి మరో తరం రాజకీయ ఎంట్రీ ఖాయంగా కనిపిస్తోంది. బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయిన కవిత ప్రస్తుతం జాగృతి సంస్థ అధ్యక్షురాలిగా తన కార్యాచరణ కొనసాగిస్తున్నారు. తెలంగాణ వ్యాప్తంగా జరిగిన బీసీ బంద్ కు కవిత మద్దతు ప్రకటించారు. తన మద్దతుదారులతో కలిసి కవిత ధర్నా చేసారు. అయితే, ఆ ధర్నాలో కవిత కుమారుడు ప్రత్యక్షమయ్యారు. బీసీ అనుకూల నినాదాలు చేయటంతో.. ఒక్క సారిగా రాజకీయ చర్చ అటు మళ్లింది. కవిత కుమారుడు ధర్నాలో పాల్గొనటం ఆసక్తి కరంగా మారుతోంది.

బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కుమారుడు రాజకీయ ఎంట్రీ ఇప్పుడు చర్చగా మారుతోంది. తెలంగాణ వ్యాప్తంగా 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ బంద్‌కు బీసీ సంఘాలు పిలుపునిచ్చాయి. బంద్ కు మద్దతుగా ఖైరతాబాద్ చౌరస్తాలో జాగృతి నేతలతో కలిసి ధర్నా చేశారు కవిత. ఖైరతాబాద్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఇదిలా ఉండగా... బీసీ బంద్‌లో కవిత పెద్ద కుమారుడు ఆదిత్య కూడా పాల్గొన్నారు. తల్లితో కలిసి ఖైరతాబాద్ చౌరస్తాలో నిర్వహించిన రాస్తారోకోలో పాల్గొన్నారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో.. కవిత కోసం కుమారుడు వచ్చారా.. లేక, రాజకీయంగా తొలి అడుగు నేడు పడిందా అనే చర్చ రాజకీయంగా మొదలైంది.

అటు ఏపీలో షర్మిల సైతం తన కుమారుడు రాజకీయ ఎంట్రీకి పావులు కదుపుతున్నారు. ఇదే విధంగా కవిత సైతం తన కుమారుడికి లైన్ క్లియర్ చేస్తున్నారనే అభిప్రాయం వినిపిస్తోంది. ఇక.. కవిత బీసీ రిజర్వేషన్ల కోసం ఉద్యమం తప్పదని హెచ్చరించారు. బీసీ బిడ్డలు తమకు రిజర్వేషన్లు కావాలని కోరుతున్నారని.. రిజర్వేషన్లు ఇచ్చే పార్టీలే బంద్ కు మద్దతు ప్రకటించటం నవ్వులాటగా ఉందని ఎద్దేవా చేశారు. దొంగ జీవోలు ఇచ్చిన కాంగ్రెస్, బీసీ బిల్లును పాస్ చేయించాల్సిన బీజేపీలు బంద్ కు మద్దతు పేరుతో డ్రామాలు చేస్తున్నాయని మండిపడ్డారు. హంతకులే వచ్చి నివాళులు అర్పించినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ బీసీ బిడ్డల పంతం దేశానికి ఆదర్శంగా నిలవాలని కవిత పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ డిపోల వద్ద బస్సులను అడ్డుకున్నారు. దీంతో హైదరాబాద్ తో పాటు పలు జిల్లాల్లో ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. రవాణా సౌకర్యం లేక ప్రయాణికులు, ఉద్యోగులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా తీసుకుని పలు ప్రాంతాల్లో క్యాబ్లు, ప్రైవేటు రవాణా వాహనాల డ్రైవర్లు ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని పలువురు వాపోతున్నారు. బంద్ కు మద్దతుగా వ్యాపార, వాణిజ్య సంస్థలు మూతపడగా, విద్యా సంస్థల యాజమాన్యాలు సెలవులు ప్రకటించాయి. అత్యవసర సేవలకు మాత్రం బంద్ నుంచి మినహాయింపు ఇచ్చారు. ఆసిఫాబాద్, సిద్దిపేట, మహబూబాబాద్, కామారెడ్డి, జగిత్యాల, నల్లగొండ, కొత్తగూడెం, సిరిసిల్ల, నిర్మల్, మెదక్, నాగర్ కర్నూల్, వరంగల్, హన్మకొండ తదితర జిల్లాల కేంద్రాల్లో బీసీ సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నేతలు రోడ్లపైకి వచ్చి ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు.

# ప్రశాంతంగా ముగిసిన బీసీ బంద్

( మొదటిపేజీ తరువాయి )



పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ బంద్‌లో పాల్గొనాలని కాంగ్రెస్ నేతలకు పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బంద్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పాల్గొననున్నారు. ఉదయం 9 గంటలకు అంబర్ పేట బంద్‌లో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎంపీ వీహెచ్ పాల్గొననున్నారు. సికింద్రాబాద్ రేథిఫైల్ బస్ స్టాండ్ వద్ద బంద్‌లో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే శ్రీ గణేష్ పాల్గొననున్నారు. ఎంజీబీఎస్ బస్ స్టాండ్ వద్ద బంద్‌లో మంత్రి వాకాటి శ్రీహరి, రాజ్యసభ సభ్యుడు అనిల్ యాదవ్ పాల్గొననున్నారు.

అటు బీసీ సంఘాల జేఏసీ ప్రకటించిన బంద్‌కు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలిపింది. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌కు ఉదయం 8 గంటలకు బీఆర్ఎస్ నేతలు చేరుకున్నారు. తెలంగాణ భవన్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లి బంద్‌లో పాల్గొన్నారు. మండల, జిల్లా స్థాయిలో బంద్‌లో పాల్గొనాలని పార్టీ కార్యకర్తలకు బీఆర్ఎస్ అధిష్ఠానం పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. బీసీ జేఏసీ బంద్‌కు తెలంగాణ జాగృతి మద్దతు తెలిపింది. ఉదయం 8 గంటలకే ఖైరతాబాద్ చౌరస్తాలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో మానవ హారం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం ప్రభుత్వం రిజర్వేషన్లు అమలు చేయాలని, ఇందుకు కేంద్రం సహకరించాలని, న్యాయస్థానాలు అనుకూలంగా తీర్పు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జాగృతి అధ్యక్షురాలు కవిత మానవహారంలో పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ వ్యాప్తంగా బంద్ హైదరాబాద్‌లో కొనసాగింది. గ్రేటర్ హైదరాబాద్ లో ఆర్టీసీ డిపోల్లో నుంచి బస్సులు కదలట్లేదు. దీంతో డిపోలకే ఆర్టీసీ బస్సులు పరిమితమయ్యాయి. అటు నగరంలో ప్రైవేట్ విద్యాసంస్థలు బంద్ కు మద్దతుగా సెలవు ప్రకటించాయి. వ్యాపార, వాణిజ్య సంస్థలు బంద్ సహకరించాలని బీసీ సంఘాలు కోరాయి. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్‌లో బస్సులు నిచిపోయాయి. ఎంజీబీఎస్ ముందు బీసీ సంఘాల నిరసన తెలిపాయి. బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో బస్సు డిపో ముందు బైఠాయించి అఖిలపక్ష నాయకులు, బీఆర్ఎస్ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ధర్నా చేపట్టారు. ఇవాళ బీసీ రిజర్వేషన్ కోసం కాంగ్రెస్ బీజేపీ వాళ్లూ ధర్నాలో పాల్గొంటున్నారని, అది సంతోషకరమైన విషయం అని శ్రీనివాస్ గౌడ్ వ్యాఖ్యానించారు. కానీ చట్టాలను చేయాల్సిన రెండు పార్టీలు అసెంబ్లీ పార్లమెంటులో సరైన చర్యలు తీసుకోకుండా రోడ్డుపై బైఠాయించడం విడ్డూరమని విమర్శించారు. ఆ రెండు పార్టీల్లో ఉండే బీసీ నాయకులు ప్రస్తుతం ఆలోచనలో పడ్డారని.. బీసీలకు న్యాయమైన రిజర్వేషన్లు లభించేదాక బీఆర్ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. నారాయణపేట జిల్లాలో బంద్ పిలుపు మేరకు నారాయణపేట ఆర్టీసీ డిపో ముందు బీసీ సంఘం, అఖిలపక్ష నాయకులు బైఠాయించారు. దీంతో డిపోకే బస్సులు పరిమితమయ్యాయి.

రాష్ట్రంలోనే రెండో పెద్ద బస్టాండ్ ఉన్నటువంటి కరీంనగర్ పట్టణంలో డిపోలకే బస్సులు పరిమితం అయ్యాయి. అటు స్కూళ్లు కూడా బంద్ పాటిస్తున్నాయి. బీసీ బంద్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. వేములవాడ ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేపట్టారు. ఈ మేరకు బైక్ ర్యాలీలో ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో బీసీ సంఘాల బంద్ జరిగింది. హనుమకొండ నుంచి సంగారెడ్డి వెళ్తున్న ఆర్టీసీ బస్సును బీసీ సంఘాల నాయకులు అడ్డుకున్నారు. పోలీసుల జోక్యంతో నాయకులు బస్సును వదిలిపెట్టారు. ఆర్టీసీ బస్సులు బయటికి రాకుండా బస్ డిపో ఎదుట నిరసన చేపట్టారు. ఈ బంద్ లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, బీఎస్పీ నాయకులు పాల్గొనున్నారు.

# బీహార్ ఎన్నికల్లో బ్రహ్మోస్

- రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్
- బ్రహ్మోస్ క్షిపణి తయారీ కేంద్రంలో పర్యటన
- క్షిపణులను భారత్ ఆర్మీకి అప్పగించారు
- వాటి నుంచి పాక్ తప్పించుకోలేదు
- ఆపరేషన్ సింధూర్ ట్రైలర్ మాత్రమే
- నవంబర్ 6, 14 తేదీలలో బీహార్ ఎన్నికలు
- బీహార్ ముఖ్యమంత్రి పదవి బీజేపిదే
- ఎన్నికల కోసం బ్రహ్మోస్ వాడాలనే ఆలోచన

**విశాలభారతి, జాతీయం:**

బ్రహ్మోస్ క్షిపణుల సత్తా ఏమిటో యావత్ ప్రపంచ దేశాలకు ముఖ్యంగా.. పాకిస్తాన్‌కి బాగా తెలిసి వచ్చింది. పాకిస్తాన్‌కి అండగా చైనా, తుర్కియే, పరోక్షంగా అమెరికా ఉన్నప్పటికీ భారత్‌ని ఎదుర్కోలేక పోయింది. బ్రహ్మోస్ క్షిపణులు వచ్చి పడిన తర్వాత ట్రంప్‌ని వేడుకొని యుద్ధం ముగింపజేసుకుంది. అయినా భారత్‌తో ప్రత్యక్ష యుద్ధం చేసి ఓడించాలనే పాక్ పాలకులు, సైన్యాధికారుల తపన ఏమాత్రం తగ్గడం లేదు. కానీ పాక్ కవ్వింపులను భారత్ పెద్దగా పట్టించుకోవడం లేదు. ఎందుకంటే కొన్నేళ్ళ క్రితం జరిగిన కార్గిల్ వార్, సర్జికల్ స్ట్రైక్, ఈ ఏడాది మే 710 తేదీలలో జరిగిన ఆపరేషన్ సింధూర్‌తోనే పాక్ సత్తా ఏపాటిదో తేలిపోయింది కనుక! అయితే ప్రతీసారి పాక్ కవ్వింపులు లేదా ఉగ్రదాడులే భారత్‌పాక్ యుద్ధం మొదలవడానికి కారణం కానవసరం లేదు. భారత్‌లో ఎప్పుడు ఏ ముఖ్యమైన ఎన్నికలు జరుగుతున్నా మోడీ ప్రభుత్వం ఏదో వంకతో పాకిస్తాన్‌పై దాడి చేయడం, అది చూపించి ఎన్నికలలో గెలుస్తుండటం పరిపాటి అయిపోయిందని పాక్ మంత్రులు విమర్శిస్తుంటారు. వాటిని పూర్తిగా కొట్టి పారేయలేము. ఎందువల్లనంటే... రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ శనివారం ఉత్తర ప్రదేశ్ రాజధాని లక్నోలో బ్రహ్మోస్ క్షిపణి తయారీ కేంద్రంలో పర్యటించారు. ఇక్కడ తయారైన మొదటి బ్యాచ్ బ్రహ్మోస్ క్షిపణులను ఆయన భారత్ ఆర్మీకి అప్పగించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “ఆపరేషన్ సింధూర్ కేవలం ట్రైలర్ మాత్రమే. పాకిస్తాన్‌కి జన్మనిచ్చిన భారత్ తలుచుకుంటే ఏం చేయగలదో నేను చెప్పాల్సిన అవసరం లేదు. పాకిస్తాన్‌లో ప్రతీ అంగుళం బ్రహ్మోస్ పరిధిలో ఉంది. వాటి నుంచి పాక్ తప్పించుకోలేదనే విషయం పాక్ పాలకులు బాగా గుర్తుంచుకోవాలి,” అని హెచ్చరించారు. బ్రహ్మోస్ గొప్పదనం గురించి చెప్పుకోదలిస్తే, వాటిని పాక్‌పై ప్రయోగించినప్పుడు అవి ఎంత విధ్వంసం సృష్టించాయో చెప్పవచ్చు. కానీ ఆపరేషన్ సింధూర్ కేవలం ట్రైలర్ మాత్రమేనని, బ్రహ్మోస్ పరిధిలో పాక్ ఉందని రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించడం అసందర్భమే. నవంబర్ 6, 14 తేదీలలో బీహార్ శాసనసభ ఎన్నికలు జరుగబోతున్నాయి. ఈసారి బీహార్ ముఖ్యమంత్రి పదవి బీజేపిదేనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా సూచన ప్రాయంగా చెప్పారు. కనుక ఈ ఎన్నికలు బీజేపికి చాలా చాలా కీలకమైనవి. కనుక బీహార్ ఎన్నికల కోసం మరోసారి బ్రహ్మోస్ వాడాలనే ఆలోచన ఉందేమో?పాక్ మంత్రులు చేస్తున్న ఈ ఆరోపణలు నిజమో కావో ఆలోగా తెలుస్తుంది.

## 150 వైన్ షాపులకు దరఖాస్తు చేసిన ఏపీ మహిళ

- రాష్ట్రంలో మద్యం దుకాణాలకు దరఖాస్తులు
- గడువు శనివారంతో ముగిసింది
- టెండర్లకు అనూహ్యంగా స్పందన తగ్గింది
- రాష్ట్రవ్యాప్తంగా 2,620 మద్యం దుకాణాలు
- గతేడాది 1.31 లక్షల దరఖాస్తులు
- శనివారం భారీగా టెండర్లు దాఖలయ్యాయి
- మహిళ 150 వైన్ షాపులకు దరఖాస్తు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు దరఖాస్తుల దాఖలు గడువు శనివారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో 243 దుకాణాలకు 4,319 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వాటిలో మెదక్ జిల్లాలో 49 మద్యం దుకాణాలకు 800 దరఖాస్తులు, సంగారెడ్డి జిల్లాలో 101 దుకాణాలకు 2270 దరఖాస్తులు, సిద్దిపేట జిల్లాలో 93 దుకాణాలకు 1249 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. అయితే తెలంగాణలో మద్యం టెండర్లకు అనూహ్యంగా స్పందన తగ్గింది. ఈసారి మద్యం దుకాణాలకు ఆశించినస్థాయిలో దరఖాస్తులు రావడం లేదని అధికారులు వాపోతున్నారు. దరఖాస్తుల గడువు ముగింపు దశకు వచ్చిన ఆశించిన స్థాయిలో స్పందన రాకపోవడంతో ఎక్సైజ్ శాఖ అధికారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీని కోసం దరఖాస్తులు పెంచేందుకు గాను... గతంలో లైసెన్సులు పొందిన వారికి స్వయంగా సందేశాలు పంపి మరీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2,620 మద్యం దుకాణాల లైసెన్సుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ గడువు శనివారంతో ముగిసింది. అయితే గత ఏడాది మద్యం దుకాణాల కోసం ఏకంగా 1.31 లక్షల దరఖాస్తులు రాగా, ఈసారి ఆ సంఖ్య దారుణంగా పడిపోయింది. మద్యం వ్యాపారంపై ఆసక్తి తగ్గడానికి పలు కారణాలు ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం మందగించడం, ఇతర వ్యాపారాలు ఆశాజనకంగా లేకపోవడం వంటివి ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. దీనికి తోడు, కొందరు వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి పోటీని తగ్గించుకునే ప్రయత్నంలో భాగంగానే దరఖాస్తులు తక్కువగా వేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అయితే శనివారం చివరి రోజు భారీగా టెండర్లు దాఖలయ్యాయి. ఈ రోజు ఒక్కరోజే 30 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. మొత్తంగా 90 వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్టు అంచనా. ఆశ్చర్యకరంగా ఏపీకి చెందిన ఓ మహిళ 150 వైన్ షాపులకు దరఖాస్తు చేసింది. ఏపీకి సరిహద్దుల్లో ఉండే జిల్లాల్లోని షాపులకు ఈమె ఎక్కువగా దరఖాస్తు చేసినట్టు సమాచారం. ఏపీ మహిళలే కాదు, దరఖాస్తు చేసుకున్న వారిలో యూపీ, కర్ణాటక, ఒడిశాకు చెందిన మహిళలు కూడా ఉండటం విశేషం.

# బీసీ బ్రహ్మాస్త్రం కోసం పోటీ

( మొదటిపేజీ తరువాయి )

ఆయుధం అని గ్రహించి మొదట్లో ఈ పేరుతో పార్లమెంటు లోపలా, బయటా పోరాడింది. కానీ తర్వాత ఆసక్తి కోల్పోయింది.అదే... కాంగ్రెస్ అధిష్టానం మిత్ర పక్షాలతో కలిసి బీసీ రిజర్వేషన్స్ కోసం గట్టిగా పోరాడుతూ ఉంటే, దీనిపై జాతీయ స్థాయిలో చర్చ జరిగి ఉండేది. దేశ వ్యాప్తంగా అన్ని పార్టీలు కాంగ్రెస్ వెనుక నడవడమో వ్యతిరేకించడమో చేసి ఉండేవి. అప్పుడు తెలంగాణలో కూడా కాంగ్రెస్ పార్టీదే పైచేయిగా ఉండేది.

కానీ కాంగ్రెస్ అధిష్టానం సీఎం రేవంత్ రెడ్డి అందించిన ఈ బ్రహ్మాస్త్రం విలువ తెలుసుకోలేక పక్కన పడేయడంతో ఈ అస్త్రాన్ని ఎత్తుకుపోతున్న మిగిలిన పార్టీలతో తెలంగాణ కాంగ్రెస్ కూడా పోటీ పడాల్సి వస్తోంది. కానీ తెలంగాణ కాంగ్రెస్ ఈ వేడిని ఇలాగే కొనసాగించగలిగితే, రాష్ట్రంలో సెంటిమెంట్ రాజకీయాల ప్రభావాన్ని కొంతవరకు తగ్గించవచ్చు. రాష్ట్రంలో తెలంగాణ సెంటిమెంట్ లేకుండా చేయగలిగితే, బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి కురుక్షేత్రంలో కర్ణుడులా మారుతుంది.

తెలంగాణలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చెయ్యాలని 2014లోనే రాష్ట్ర ఏర్పాటు సమయంలో హామీ ఇచ్చారు. కానీ అమలు కాలేదు. ఇటీవల తెలంగాణ హైకోర్టు, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం బీసీ కోటా జీఓపై మధ్యంతర స్టే ఇచ్చింది. ఈ తీర్పును బీసీ సంఘాలు 'సామాజిక న్యాయానికి వ్యతిరేకం' అని విమర్శించాయి. సుప్రీంకోర్టు అక్టోబర్ 6న ఈ 42శాతం కోటాపై ప్రభుత్వ పిటిషన్‌ని తిరస్కరించి, పాత రిజర్వేషన్ విధానం ప్రకారం ఎన్నికలు జరుపుకోవచ్చని ఆదేశించింది. అంటే.. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి దాటకుండా ఎన్నికలు జరుపుకోవచ్చని తెలిపింది. సో.. అసలు సమస్య సుప్రీంకోర్టు తీర్పు దగ్గర ఉంది. ఆ తీర్పు అలా ఉన్నంత కాలం.. 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యే ఛాన్సే లేదు. మరి ఆ తీర్పును సమీక్షించాలంటే.. కేంద్రం ప్రయత్నించాలి. అంటే.. బీజేపీ ప్రయత్నించాలి. పార్లమెంట్ ద్వారా.. రాజ్యాంగ సవరణ చెయ్యడం లేదా.. తీర్పును సమీక్షించాలని కోరడం వంటివి చెయ్యాలి. కానీ బీజేపీ ఆ ప్రయత్నాలేవీ చెయ్యట్లేదు. పైగా.. బంద్‌కి మద్దతు ఇస్తోంది. చెయ్యాల్సిన పార్టీ ఏమీ చెయ్యకుండా.. బంద్‌కి మద్దతు ఇవ్వడం డ్రామా కాదా, బీసీలను మోసం చెయ్యడం కాదా అనే ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి.




ఈ బంద్ తర్వాత ఏం జరుగుతుంది? ఏమీ జరగదు. ఎందుకంటే.. ఈ బంద్ కారణంగా సుప్రీంకోర్టు తీర్పేమీ మారదు. కేంద్రం అలాంటి ఒత్తిడేమీ ఈ బంద్‌తో తేవట్లేదు. అందుకే.. నిజాలు తెరపైకి రావాలి. బీసీలకు నిజంగా ఎలా అన్యాయం జరుగుతోందో చర్చ జరగాలి. అన్ని పార్టీలూ బీసీలకు సపోర్టుగా మాట్లాడతాయి. కానీ.. వాస్తవంలో బీసీలకు ఏమీ చెయ్యవనే విమర్శలు చాలా ఉన్నాయి. అసలు సొల్యూషన్ వదిలేసి.. పైపై డ్రామాలు చేస్తున్నాయనే విమర్శలు పార్టీలపై వస్తున్నాయి.

# బీసీ ఉద్యమం ఇక్కడితో ఆగదు

- బీసీలు హక్కుల సాధన వ్యవహారం
- తెలంగాణ బంద్ పిలుపు ఇచ్చాయి
- ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు
- బీసీ ఐకాస బంద్‌కు పిలుపునిచ్చింది
- చట్టసభల్లో కూడా రిజర్వేషన్లు ఇవ్వాలి
- బీసీలను మోసం చేస్తున్నారు
- తమిళనాడు రిజర్వేషన్లు అమలు




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

సమాజంలో సగానికంటే ఎక్కువ ఉన్న బీసీలు తమ హక్కుల సాధన కోసం శనివారం తెలంగాణ బంద్ పిలుపు ఇవ్వడం జరిగింది అని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ‘బీసీలు మేమెంతో మాకంత కావాలి.యాచించే స్థాయిలో కాదు శాసించే స్థాయిలో ఉన్నాం’ అని ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. తెలంగాణ బీసీ సంఘాల జేఏసీ పిలుపు మేరకు ఎంపీ ఈటల రాజేందర్ బంద్‌లో పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ బస్ స్టేషన్ దగ్గర నిర్వహించిన ఆందోళనలో పాల్గొన్న ఈటల రాజేందర్ తమ పోరాటం 42 శాతం రిజర్వేషన్ల స్థానిక సంస్థలలో మాత్రమే కాదు.. చట్టసభల్లో కూడా రిజర్వేషన్లు వచ్చే వరకు ఆగదు అని చెప్పుకొచ్చారు.‘మాది యాచన కాదు... పాలించే శక్తి మాకు ఉంది.మేమెంతో మాకంత కావలసిందే’అని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ‘బీసీ రిజర్వేషన్ అమలు కాదని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిండు అసెంబ్లీ చెప్పారు. అన్నీ తెలిసి కూడా బీసీలను మోసం చేస్తున్నారు. తమిళనాడు ఒక్కటి మాత్రమే నిజాయితీగా రిజర్వేషన్లు అమలు చేసింది. పెరియార్ మొదలు అనేక గొప్ప ఉద్యమాలు జరిగాయి’అని ఎంపీ ఈటల రాజేందర్ వెల్లడించారు.‘21 మంది రిటైర్డ్ ఐఏఎస్ అధికారులతో రెండేళ్ల పాటు బీసీల ఆర్థిక, సామాజిక, విద్య అన్ని రంగాలపై సమగ్ర సర్వే చేసి ఆ రిపోర్ట్ తో రాజ్యాంగంలో 9వ షెడ్యూల్‌లో చేర్చారు. తెలంగాణలో కూడా కేసీఆర్ ఒక సారి సర్వే చేశారు. బీసీ కమీషన్ వేశారు. ఎన్ని వేసిన నిజాయితీ లేదు కాబట్టి అమలు కాలేదు. ఈ ప్రభుత్వం కూడా పేరుకు కమీషన్లు వేశారు తప్ప నిజాయితీ లేదు’అని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శలు గుప్పించారు.‘ కాంగ్రెస్ ప్రభుత్వంలో లెక్కలు తీశారు.. కానీ అవన్నీ తప్పుల తడక. 52 శాంతం ఉంటే 42 శాతం అని కాకి లెక్కలు చెప్తున్నారు. నేను చెప్పేది అబద్ధం అయితే రాజకీయాల నుండి తప్పుకుంటా. నేను మాట్లాడిన మాటలపై ఎక్కడైనా చర్చకు సిద్ధం’ అని ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. ‘బీసీలు మేమెంతో మాకంత కావాలి. యాచించే స్థాయిలో కాదు శాసించే స్థాయిలో ఉన్నాం.ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్నంత కాలం ఆ కుటుంబం వారికే అధికారం దక్కుతుంది. కుటుంబమే ఏలుతుంది’అని ఎంపీ ఈటల రాజేందర్ ధ్వజమెత్తారు.‘కాంగ్రెస్ పార్టీ జాతీయ పార్టీ అయినా స్వతంత్రం వచ్చినప్పటినుండి ఒక్క బీసీ, ఒక ట్రైబల్ ముఖ్యమంత్రి కాలేక పోయారు.ఈ రాష్ట్రంలో బీసీలు 8 మంది మంత్రులుండాలి... కానీ ముగ్గురున్నారు. ఉన్న వారికి ఇచ్చిన మంత్రి శాఖలు చిన్నవి.బీసీల పట్ల మొసలికన్నీరు కాకపోతే నామినేటెడ్ పోస్టుల్లో ఎందుకు బీసీలకు స్థానం కల్పించలేదు’అని ఎంపీ ఈటల కాజేందర్ డిమాండ్ చేశారు. తెలంగాణలో బీసీని ముఖ్యమంత్రిని చేస్తాం అని ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించారని ఎంపీ ఈటల రాజేందర్ గుర్తు చేశారు. నరేంద్ర మోడీ క్యాబినెట్‌లో 27 మంది OBC మంత్రులు ఉన్నారు. బీజేపీ నిజాయితీని ఎవరు సంకించలేరు అని ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.‘మాదిగ రిజర్వేషన్ చేస్తామని మాట ఇచ్చి అమలు చేసిన ప్రధాని నరేంద్ర మోడీ .తమిళనాడులో ఏ పద్ధతి ప్రకారం చేశారో అదే పద్ధతిలో చేశారో ఇక్కడ కూడా చెయ్యాలి.ఈ బంద్‌కి పిలుపు ఇచ్చింది బీసీ జేఏసీ. అనివార్యంగా అన్ని పార్టీలు పాల్గొనాల్సిన పరిస్థితి వచ్చింది’అని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ‘ఈ ఉద్యమం ఇక్కడితో ఆగదు. బీసీ బంద్ విజయవంతం కావడం తొలిసారి.42 శాతం రిజర్వేషన్ల స్థానిక సంస్థలలో మాత్రమే కాదు...చట్టసభల్లో కూడా రిజర్వేషన్లు వచ్చే వరకు ఆగదు’అని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ‘తెలంగాణ రాష్ట్రం ఎలా సాధ్యం అయిందో బీసీ రాజ్యాధికారం కూడా సాధ్యం అవుతుంది. ఆశయాన్ని ముద్దాడే వరకు ఐక్య ఉద్యమాలు చేద్దాం’అని ఎంపీ ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు.

# బంద్ ఎఫెక్ట్.. ప్రైవేట్ వాహనాల దోపిడీ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ లో.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశం ఇంకా ఓ కొలిక్కి రాలేదు. న్యాయస్థానాలు దీన్ని వ్యతిరేకించాయి. పాత పద్దతిలోనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని సుప్రీం కోర్టు తీర్పు వెల్లడించింది. దీంతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ.. బీసీ సంఘాల జేఏసీ పిలుపునిచ్చిన తెలంగాణ బంద్ ప్రశాంతంగా కొనసాగుతోంది. రాష్ట్రంలోని అన్ని పార్టీలు బంద్‌లో పాల్గొన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితం అయ్యాయి. అత్యవసర సేవలు మినహా అన్ని రకాల సర్వీసులు నిలిచిపోయాయి. వ్యాపారులు స్వచ్ఛంగా షాపులు మూసి వేసి.. బంద్‌లో పాల్గొన్నారు. అక్టోబర్18, శనివారం నాడు బీసీ జేఏసీ తలపెట్టిన బంద్‌కు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. హైదరాబాద్ నగరంతో పాటు అన్ని జిల్లాల్లో ప్రజలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. బంద్ నేపథ్యంలో ఆర్టీసీ బస్సులు ఎక్కడికక్కడ నిలిచిపోయి.. డిపోలకే పరిమితం అయ్యాయి. రాజధాని హైదరాబాద్ నగరంలో కూడా వ్యాపారులు స్వచ్ఛందంగా షాపులు మూసివేసి బంద్‌లో పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులు, ఉద్యోగస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక ఇదే అదునుగా ప్రైవేట్ క్యాబ్ డ్రైవర్లు, ఆటోలు ప్రయాణికులను దోచుకుంటున్నారు. మిగతా రోజులతో పోలిస్తే.. డబుల్ ఛార్జీలు వసూలు చేస్తూ ప్రయాణికుల జేబుకు చిల్లు పెడుతున్నారు. ప్రైవేటు ఉద్యోగులు, ఎమర్జెన్సీ విభాగాల్లో పని చేసే సిబ్బంది.. విధులకు హాజరవ్వడం కోసం ప్రైవేటు ట్రావెల్స్‌ని ఆశ్రయిస్తే.. వారు డబుల్ ఛార్జీలు వసూలు చేస్తున్నారు.సాధారణ రోజుల్లో ఉప్పల్ నుంచి హన్మకొండకు రూ.300 టికెట్ కాగా.. నేటి బంద్ కారణంగా.. ప్రయాణికుల వద్ద నుంచి నాలుగు వందల రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారు. అంటే రూ.700లు తీసుకుంటున్నారు. ఎల్బీ నగర్ నుంచి సూర్యాపేటకు మామూలు రోజుల్లో రూ.200 కాగా ప్రస్తుతం రూ.800 డిమాండ్ చేస్తున్నారు క్యాబ్ డ్రైవర్లు. ఇక హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లాలంటే.. ఒక్కొక్కరికి 2 వేల రూపాయలు వసూలు చేస్తున్నారు.

సోమవారం దీపావళి పండుగ.. దానికి ముందు ఆదివారం, శనివారం బంద్ కారణంగా వరుసగా మూడు రోజులు సెలవులు కలసి రావడంతో.. చాలా మంది సొంతూళ్లకు ప్రయాణం అయ్యారు. కానీ బంద్ కారణంగా బస్సులు ఎక్కడిక్కడే నిలిచిపోయాయి. దీంతో, సొంత ఊళ్లకు వెళ్లే ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక ఇదే అదునుగా ప్రైవేట్ ట్రావెల్స్ రెట్టింపు ఛార్జీలు వసూలు చేస్తూ ప్రయాణికుల జేబుకు చిల్లు పెడుతున్నాయి.

# బంద్ ప్రశాంతం

- బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి
- తోటకూర వజ్రేష్ యాదవ్

**మేడిపల్లి, విశాలభారతి:**

తెలంగాణ లో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్ల కోసం విడుదల చేసిన జీవోకు చట్టబద్ధత కల్పించి స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించాలని కోరుతూ శనివారం చేపట్టిన బీసీ బంద్ ప్రశాంతంగా ముగిసింది. బోడుప్పల్ కార్పొరేషన్ అధ్యక్షుడు పోగుల నరసింహ రెడ్డి అధ్వర్యంలో బోడుప్పల్ అంబేద్కర్ విగ్రహం నుండి ఉప్పల్ డిపో వరకు నిర్వహించిన ర్యాలీ అనంతరం డిపో వద్ద చేపట్టిన ధర్నా కార్యక్రమంలో మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో అవకాశాలు కల్పించేలా గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నేతృత్వంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అధ్వర్యంలో జీవో నెంబరు 9 ను విడుదల చేసి ఎన్నికలకు సిద్ధం కాగా కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా చట్టబద్ధత కల్పించకుండా తాత్సారం చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్,మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం తరుణ్ గౌడ్,పీరజాదిగూడ మాజీ డిప్యూటీ మేయర్ శివ కుమార్ గౌడ్, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్లు బొమ్మకు కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు

# సీఎం సీరియస్

( మొదటిపేజీ తరువాయి )

పనితీరును మార్చుకోలేదని ఆయన గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి శనివారం తన నివాసంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణ రావు , సీఎం ఆఫీస్ సెక్రటరీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో, అధికారులు స్వతంత్ర నిర్ణయాలు తీసుకొని ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే చర్యలకు పాల్పడకూడదని ఆదేశించారు. రాష్ట్ర అభివృద్ధి , ప్రజల సంక్షేమం కోసం అధికారులు సమన్వయంతో పనిచేసి, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

సీఎం రేవంత్ రెడ్డి, అధికారులు సోమరితనాన్ని వదిలేసి, పథకాల ప్రయోజనాలను ప్రజలకు చేర్చడంలో మరింత చురుకుగా వ్యవహరించాలని ఆదేశించారు. చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణ రావుకు, అన్ని విభాగాల సెక్రటరీల నుంచి క్రమం తప్పకుండా నివేదికలు సేకరించి, పనుల పురోగతిని సమీక్షించాలని సూచించారు. అలాగే, సీఎం ఆఫీస్ అధికారులు ప్రతి వారం తమ డిపార్ట్‌మెంట్ల నివేదికలను సమర్పించాలని, ఆ నివేదికలను సీఎం స్వయంగా సమీక్షిస్తారని ఆదేశించారు. కేంద్ర నిధుల స్థితిని సమీక్షిస్తూ, సీఎం రేవంత్ రెడ్డి, అన్ని విభాగాల సెక్రటరీలు వెంటనే చర్యలు తీసుకొని, పెండింగ్‌లో ఉన్న కేంద్ర గ్రాంట్లు , కేంద్ర ప్రాయోజిత పథకాల కింద నిధులను విడుదల చేయించేలా చూడాలని ఆదేశించారు. రాష్ట్ర వాటా ఇప్పటికే చెల్లించిన పథకాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, కేంద్ర నిధుల విడుదలను వేగవంతం చేయాలని సూచించారు. ఏ ఫైల్ లేదా ప్రాజెక్ట్ పెండింగ్‌గా ఉండకూడదని, అన్ని పనులు జాప్యం లేకుండా పూర్తి కావాలని ఆదేశించారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా, కొందరు అధికారులు తమ పనితీరును మెరుగుపరచుకోలేదు. స్వతంత్ర నిర్ణయాలు తీసుకొని ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే చర్యలకు పాల్పడితే సహించేది లేదు. అధికారులు సమన్వయంతో పనిచేసి, రాష్ట్ర అభివృద్ధి మరియు ప్రజల సంక్షేమం కోసం కృషి చేయాలి" అని రేవంత్ పేర్కొన్నారు. శనివారం ఆయన శిల్పకళా వేదికలో జరిగిన కార్యక్రమంలో గ్రూప్2 ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గత పాలకులు యువత ఆకాంక్షలను రాజకీయాల కోసం వాడుకున్నారంటూ విమర్శలు గుప్పించారు. వారి కుటుంబం కోసమే గత పాలకులు ఆలోచించారు. గత పాలకులు నిజాం నవాబులతో పోటీపడి సంపద పెంచుకున్నారంటూ ఆరోపించారు. ''గత పదేళ్లలో నిరుద్యోగుల సమస్యను పరిష్కరించలేదు. రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం మూడేళ్లకే కూలింది. ఎకరానికి రూ.కోటి సంపాదించే విద్య ఉందని గత పాలకులు చెప్పారు. కానీ ఆ విద్యను రైతులకు మాత్రం నేర్పలేదు. గత పాలకులు వారి కుటుంబసభ్యులకే పదవులు ఇచ్చు




కున్నారు. కానీ గ్రూప్2 నియామకాలు చేపట్టాలని ఆలోచించలేదు'' అంటూ రేవంత్ దుయ్యబట్టారు.

''విద్యార్థి, నిరుద్యోగ యువత ఆత్మబలిదానాలతో తెలంగాణ రాష్ట్రం సాకారమైంది. అమరుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణలో పదేళ్లు అధికారం చెలాయించిన వాళ్లు ఒక్కక్షణం కూడా నిరుద్యోగుల గురించి ఆలోచన చేయలేదు. అమరుల ఆశయ సాధనపై వాళ్లు ఆలోచన చేసి ఉంటే మీకు ఎనిమిదేళ్ల క్రితమే ఉద్యోగాలు వచ్చేవి. వాళ్ల కుటుంబంలో పదవులు భర్తీ చేసుకున్నారు తప్ప గ్రూప్2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వలేదు. పదిహేనేళ్లుగా గ్రూప్1 ఉద్యోగాల భర్తీ జరగలేదు అంటే... ఇంతకంటే దౌర్భాగ్యం మరొకటి ఉంటుందా?. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మేం గ్రూప్1 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి చేశాం. గ్రూప్ 2 పరీక్షలు నిర్వహించి ఇవాళ నియామక పత్రాలను అందిస్తున్నామని రేవంత్ పేర్కొన్నారు.

# మడావి హిడ్మా ఎక్కడ..!

- కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్
- మావోయిస్టుల గుళికల్ని దెబ్బతీస్తోంది
- కీలక నేతలు వరుసగా లొంగిపోతున్నారు
- తాజాగా మడావి హిడ్మా పేరు హాట్ టాపిక్
- స్పెషల్ ఆపరేషన్ చేపడుతున్నట్లు టాక్
- హిడ్మాకు మూడంచెల భద్రతా వ్యవస్థ
- రక్షణగా ఎల్లప్పుడూ 50 మంది సభ్యులు





విశాలభారతి, స్టేట్ బ్యూరో:

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ చర్యలు మావోయిస్టుల గుళికల్ని దెబ్బతీయడం ప్రారంభించాయి. ఐదుగురు దశాబ్దాల పాటు సాగిన మావోయిస్టు ఉద్యమం నేతృత్వంలోని కొంతమంది కీలక నేతలు వరుసగా లొంగిపోయారు. వందలాది మావోయిస్టులు ఎదురుదాడుల్లో చనిపోవడమేకాదు, మిగిలిన నాయకులు విముక్తి దిశగా పయనిస్తున్నారు. మహారాష్ట్రలో మాజీ కేంద్ర నాయకుడు మల్లోజుల వేణుగోపాల్ (అలియాస్ అభయ్) మోదీ, ఫడ్నవీస్ సమక్షంలో లొంగిపోవడమంటే ఈ కార్యకలాపాల తీవ్రతను చూపిస్తుంది. అలాగే ఛత్తీస్‌గఢ్‌లో సుక్మా జిల్లాలో రాజ్‌మన్ (అలియాస్ రాజ్‌మోహన్) కూడా పార్టీలోని హస్తం వదిలిపెట్టారు. తాజాగా తక్కళ్లపల్లి వాసుదేవరావు (అలియాస్ ఆశన్న) స్వస్థల ప్రాంతంలో సమర్పణ అయ్యారు. ఇతనితో పాటు మరో 130 మంది మావోయిస్టులు భైరామ్‌గఢ్‌లో పోలీసుల ముందు లొంగిపోయారు. అంతేకాక, సుక్మా జిల్లాలో 27, కాంకేర్ జిల్లాలో 50 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు పోలీసులు తెలిపారు. ముఖ్య నేతలు ఇంకా ఆయుధాలతో కూడిన స్థాయిలో పోలీసుల అవతల లొంగిపోతున్నారు. ఈ పరిణామాలు మావోయిస్టు పార్టీలో ఆత్మవిశ్వాసం దెబ్బతినే దశకు తీసుకెళ్లాయనే చెప్పాలి. ఈ క్రమంలో తాజాగా వినిపిస్తున్న మరో పేరు మడావి హిడ్మా. ఈ మావో కింగ్‌ను పట్టుకునేందుకు ప్రభుత్వం స్పెషల్ ఆపరేషన్ చేపడుతున్నట్లు సమాచారం. ఇటీవల హిడ్మా పేరుతో ఓ ఏరియా కమిటీ సభ్యుడు లొంగిపోతే ఆ విషయం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ప్రస్తుతం పీఎల్‌జీఏ కంపెనీ వన్ కమాండర్‌గా ఉన్న హిడ్మాకు సంబంధించిన కీలక సమాచారం భద్రతా దళాలకు చిక్కినట్లు సమాచారం. ఆయన ప్రస్తుతం ఎక్కడ పాగా వేశాడో తెలియరాకున్నా దాదాపు 20 ఏళ్ల తర్వాత హిడ్మాకు సంబంధించిన తాజా ఫొటోగా పేర్కొంటున్న చిత్రం వెలుగుచూడడం గమనార్హం. మడావి హిడ్మాకు మూడంచెల భద్రతావ్యవస్థ ఉంటుంది. దగ్గరగా ఉండే ఏ టీమ్‌లో 10-12 మంది సభ్యులు, మధ్యలో ఉండే బీ టీమ్‌లో 20-22 మంది, వెలుపలి రక్షణ వలయంలో 15 మంది వరకు సభ్యులు ఆయనకు రక్షణగా ఉంటారు. దళం/కంపెనీలో ఇతరులకు వండే ఆహార పదార్థాలను హిడ్మా తినడని, ఆయనకు ప్రత్యేకంగా వంట తయారు చేస్తారని చెబుతారు. హిడ్మా వ్యక్తిగత అవసరాల కోసం ఇద్దరు సభ్యులు ప్రత్యేకంగా ఉంటారని ప్రచారం.

ఎక్కడైనా క్యాంప్ వేసినా అందరితో కలివిడిగా ఉండకపోగా, ప్రత్యేక క్యాంపులో ఉంటాడు. హిడ్మాను ఎవరైనా కలవాలంటే ఆయన వ్యక్తిగత సహాయకుల ద్వారా సంప్రదించాలని సమాచారం. కంపెనీలో పనిచేసే సాధారణ మావోయిస్టులకు సైతం ఆరు నెలలకోసారి కూడా హిడ్మా కనిపించడని తెలిసింది. ఆయన వ్యక్తిగత వివరాలు బయటకు రాకుండా అనేక జాగ్రత్తలు తీసుకుంటుండగా, పొలిటికల్ వింగ్ కంటే ఆర్మీ విభాగంపైనే ఎక్కువగా మక్కువ చూపిస్తాడు. ప్రస్తుతం పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కంపెనీ 1కి కమాండర్‌గా ఉన్నాడు. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ, సెంట్రల్ రీజినల్ బ్యూరో, తెలంగాణ కమిటీలకు ఈ కంపెనీ రక్షణ కల్పిస్తోంది. దండకారణ్య ప్రాంతం హిడ్మా అడ్డాగా ఉంది.

సల్వాజుడుం సృష్టికర్త మహేంద్రకర్మ టార్గెట్‌గా 2013 మే 25న సుక్మా జిల్లాలోని ధర్మా లోయలో జిరామ్‌ఘాటీ దగ్గర జరిపిన దాడిలో కేంద్ర కమిటీ సభ్యురాలు కల్పన అలియాస్ సుజాతతోపాటు హిడ్మా కీలకపాత్ర పోషించాడు. ఈ ఘటనలో కాంగ్రెస్ అగ్రనేత నందకుమార్ పటేల్‌తో పాటు 27 మంది చనిపోయారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. అంతకు నెలరోజుల ముందు సుక్మా జిల్లా కంచాల దగ్గర పోలీసులపై మెరుపుదాడికి దిగారు. హెలికాప్టర్ ఎక్కుతున్న ఓ పోలీసు ఉద్యోగిపైకి కాల్పులు జరిపారు.

ఆయన మృతదేహం అప్పగింత విషయంలో మూడు రోజులు నెలకొన్న ఉత్కంఠ హిడ్మా అంటే హడల్ అనే విధంగా మారింది. దీంతో భద్రతాదళాలు హిడ్మాపై కూపీ లాగడం మొదలుపెట్టాయి. చాన్నాళ్ల తర్వాత 2021 ఏప్రిల్‌లో బీజాపూర్ జిల్లా తెర్రం పోలీస్‌స్టేషన్ పరిధిలో అంబూష్ చేశారు. ఈ ఘటనలో 22 మంది జవాన్లు చనిపోయారు. ఈ ఘటన భద్రతాదళాల వెన్నులో వణుకు పుట్టించింది. ఈ ఘటన తర్వాత హిడ్మా పేరు వింటేనే భయపడే పరిస్థితి వచ్చింది. ఆ తర్వాత 2023 ఏప్రిల్ 26న బీజాపూర్ జిల్లా ఆరాన్‌పూర్ దగ్గర ఐఈడీ బాంబు పేల్చిన ఘటనలో 10 డీఆర్‌జీ జవాన్లు చనిపోయారు. ఆ తర్వాత భద్రతాదళాలపై ఏ భారీ దాడి జరిగినా దాని వెనుక హిడ్మానే ఉన్నాడనే ప్రచారం జరగడం సర్వసాధారణమైంది.

హిడ్మా సొంతూరు ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పువ్వర్తి. ఆయన మురియా తెగకు చెందిన ఆదివాసీ. బాలసంఘం ద్వారా మావోయిస్టు పార్టీలోకి వెళ్లిన హిడ్మా విప్లవ భావాల ను నరనరాన ఒంట బట్టించుకున్నాడు. మావోయిస్టులు నడిపే స్కూల్‌లో చదువుతూ ఏ ఫర్ ఆరమ్స్, బీ ఫర్ బెంగాల్, సీ ఫర్ చారు మంజుదార్ అన్నట్టుగా కిషన్ జీ అలియాస్ భద్రన్న నేతృత్వంలో సాయుధపోరులో తొలి అడుగులు వేశాడు. ఆపై జేగురుగొండ ఏరియా దళ కమాండర్‌గా ఉన్న సమయంలో అగ్రనేత నంబాల కేశవరావు డైరెక్షన్‌లో జరిగిన చింతల్నార్ -టేకుమెట్ల దాడిలో ముందుండి నడిచాడు. ఈ అంబూష్‌దాడిలో 76 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు చనిపోయారు. ఈ ఘటన తర్వాత మావోయిస్టు పార్టీలో హిడ్మాకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. అనంతరం మరో అగ్రనేత చలపతి దగ్గర విప్లవ పాఠాలు నేర్చుకున్నాడు.



## రైతు సహకార సంఘం చైర్మన్‌గా కొత్తపల్లి జైపాల్‌రెడ్డి

**శుభాకాంక్షలు తెలియజేసిన యువజన కాంగ్రెస్ నాయకులు**

పెద్ద అంబర్‌పేట్, విశాలభారతి:

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం బాటసింగారం రైతు సహకార సంఘం చైర్మన్‌గా కొత్తపల్లి జైపాల్‌రెడ్డి ఎన్నికైన సందర్భంగా పెద్ద అంబర్‌పేట్ యువజన కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకుడు కొత్తపల్లి సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతు సంక్షేమం కోసం జైపాల్‌రెడ్డి ఎల్లప్పుడూ కృషి చేస్తారని విశ్వాసం వ్యక్తం చేస్తున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## సీసీ రోడ్ల పనులను పరిశీలించిన కార్పొరేటర్ కళ్లెం



పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:

హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి శనివారం రోజు హయత్‌నగర్ పాత గ్రామంలో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. బస్తీ వాసులకు రాబోయే రోజుల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రోడ్ల లెవెల్స్ సరిగ్గా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. నాణ్యతతో కూడిన నిర్మాణ పనులు చేయాలని సంబంధిత అధికారులకు సూచించాం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో బస్తీ వాసులు ఉగాది జగదీష్ స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్పీ సోషల్ మీడియా కన్వీనర్‌గా ప్రహ్లాద్ యంజాల



పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:

బహుజన్ సమాజ్ పార్టీ రంగా రెడ్డి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా ప్రహ్లాద్ యంజాల నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నా మీద నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్ కి ధన్యవాదాలు అని తెలిపారు. ఈ సందర్భంగా ప్రహ్లాద్ యంజాల రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్ ని శనివారం రోజు మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో రంగా రెడ్డి జిల్లా బీఎస్పీ కార్యదర్శి గ్యార మల్లేష్, నాయకులు చిత్రం కృష్ణ , డొప్ప తరుణ్ , బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్న బీజేపీ

తొర్రూరు, విశాలభారతి:

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో బీజేపీ అడ్డుకుంటుందని మాజీ టీపీసీసీ సభ్యుడు ముత్తినేని సోమేశ్వరరావు ఆరోపించారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తొర్రూర్ డివిజన్ కేంద్రంలో చేపట్టిన బంద్ ప్రశాంతంగా కొనసాగింది. పట్టణంలోని దుకాణ సముదాయాలు బంద్ చేయించి డిపో ఎదుట నిరసన తెలిపారు.అనంతరం బస్టాండ్ సెంటర్లో బైక్ ర్యాలీ చేపట్టి ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్,పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్ లతో కలిసి సోమేశ్వరరావు మాట్లాడారు. బీసీలకు రిజర్వేషన్లు పెంచడంలో కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధి చూపడం లేదన్నారు. తెలంగాణలో 42 శాతం రిజర్వేషన్ ప్రతిపాదన వచ్చినా పార్లమెంట్ లో చట్టం చేయకుండా మోదీ ప్రభుత్వం అడ్డుపడుతోందన్నారు. బీజేపీ నిజంగా బీసీల పక్షాన ఉంటే రాబోయే పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు. బీసీలను మోసగించే కుట్రలను ఆ సమాజం గమనిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు పింగిలి ఉష,ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు జాటోత్ రవి నాయక్,నాయకులు చిత్తలూరి శ్రీనివాస్ గౌడ్,గుండాల నరసయ్య,చెవిటి సధాకర్,తాళ్లపల్లి బిక్షం గౌడ్, జక్కుల రామ్ రెడ్డి, నల్లమాస సమ్మయ్య, సురేందర్ రాజు,బచ్చలి లక్ష్మణ్,మోకాటి వెంకన్న,దీకొండ మధు, మొగుళ్ల లింగన్న గౌడ్, నల్లపు రాజు, కక్కెర్ల సహదేవ్, వెన్నం సోమిరెడ్డి, వెంకట్ రెడ్డి, కాసర్ల రంగయ్య, అలువాల సోమయ్య,వెంకన్న యాదవ్, రాజేష్ యాదవ్, ప్రవీణ్ యాదవ్, అభిరాం నాయక్,వల్లపు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## రాజేంద్రనగర్ నియోజకవర్గ బంద్ విజయవంతం

**అరంగర్ చౌరస్తా వద్ద ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ధర్నా**

రాజేంద్రనగర్, విశాలభారతి:

స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధించాలనే లక్ష్యంతో బీసీ సంఘాల ఐకాస ఇచ్చిన తెలంగాణ బంద్‌కు రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అపూర్వ మద్దతు లభించింది. శనివారం జరిగిన ఈ బంద్‌లో రాజకీయ పార్టీలు, సంఘాలకు అతీతంగా అందరూ పాల్గొని బంద్‌ను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ బీసీ సంఘాలకు మద్దతుగా రావడం జరిగింది. ఆయన అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలతో కలిసి అరంగర్ చౌరస్తా వద్ద ధర్నాలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.... రిజర్వేషన్ల అంశాన్ని శాశ్వతంగా పరిష్కరించేందుకు, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చి, తక్షణమే చట్ట సవరణ చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. బీసీల హక్కుల పరిరక్షణ కోసం పార్టీలకు అతీతంగా అందరూ ఏకమవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పార్లమెంటులో బీసీ బిల్లు ను ప్రవేశపెట్టి చట్టంగా చేసేంతవరకు బీసీ సంఘాలు పోరాడుతూనే ఉంటాయని ఈ సందర్భంగా తెలిపారు బంద్‌లో నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పక్షాల నాయకులు, కార్యకర్తలు, బీసీ సంఘాల ప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలు ఉత్సాహంగా పాల్గొని రిజర్వేషన్ల ఆవశ్యకతను తెలియజేశారు.



## గుర్తు తెలియని వ్యక్తి మృతి

**చెరువులో మృతదేహం లభ్యం**

రాజేంద్రనగర్: విశాలభారతి :

గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతి దేహం లభ్యమైనది. నార్సింగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..శనివారం మధ్యాహ్నం 12:30 గంటలకు మంచిరేవుల గ్రామంలోని కీర్తి విల్లాస్ వెనుక ఉన్న చెరువులో ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం కనిపించిందని పోలీసులకు సమాచారం అందింది. హెడ్ కానిస్టేబుల్ ఎం.జగదీశ్వర్, హోమ్ గార్డ్ రమేష్ అక్కడికి చేరుకొని మృతదేహాన్ని వెలికి చేయించారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలియ రాలేదు. మృతదేహం పూర్తిగా కూలిపోయిన స్థితిలో కనిపించింది. మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు 9491039034, 9490617189, 9440018848 నంబర్లలో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

## బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కేటాయించాలి

**మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్**

సీరోల్, విశాలభారతి:

రాష్ట్రవ్యాప్తంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బంద్ ను విజయవంతం చేశారు. డోర్నకల్ ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ రామచంద్రునాయక్ ఆదేశాల మేరకు సీరోల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలో బంద్ విజయవంతంగా నిర్వహించారు. వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. బంద్ సందర్భంగా బీసీ సంఘాలు, విద్యార్థి సంఘాలు, మహిళా సమాఖ్యలు, యువజనులు విస్తృతంగా పాల్గొన్నారు అని మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంలో మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ మాట్లాడుతూ "రాష్ట్ర ప్రభుత్వం బీసీల జనగణన చేసి వారి జనాభా 56 శాతానికి పైగా ఉన్నట్లు నిర్ధారించింది. దానికి అనుగుణంగా 42 శాతం రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో ఆమోదించి, గవర్నర్ మరియు రాష్ట్రపతి ఆమోదానికి పంపింది. కానీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మాత్రం ఆ బిల్లును రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేర్చకుండా ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటోందని తీవ్రంగా విమర్శించారు. బంద్‌లో కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, యువత నినాదాలతో సీరోల్ వీధులు మార్మోగించగా బీసీలకు న్యాయం జరగాలి, 42శాతం రిజర్వేషన్ తప్పనిసరి" అనే నినాదాలు ప్రజల్లో ఉత్సాహం నింపాయి. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కేటాయించకపోతే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



## రిజర్వేషన్లు కల్పించే బాధ్యత ప్రభుత్వాలదే

- ప్రభుత్వాలు పట్టించుకోకపోతే రాష్ట్రంలో అగ్గి రాజేస్తాం
- ఉప్పల్ ఆర్టీసీ డిపో ముందు నిరసన తెలిపిన డి. రాజారాం యాదవ్

మేడిపల్లి, విశాలభారతి:

42 శాతం బీసీ రిజర్వేషన్లకు న్యాయపరమైన అడ్డంకులు ఎదురుకావడానికి కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని బీసీ జేఏసీ కో చైర్మన్ రాజారామ్ యాదవ్ అన్నారు. అసలు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇష్టం లేదని ఆయన ఆరోపించారు. బీసీల రిజర్వేషన్ అంశాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే పరిష్కరించాలని రాజారామ్ యాదవ్ డిమాండ్ చేశారు. ఆగ మేఘాల మీద ఆర్డినెన్స్ తెచ్చి అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించిన బీసీ ప్రధానినని చెప్పుకుంటున్న మోడీ బీసీ రిజర్వేషన్ల అంశంపై రాజ్యాంగ సవరణకు ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. బీసీలు ఈ దేశంలో ఏం పాపం చేశారని రాజారామ్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. 42 శాతం రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ కల్పించేంతవరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో లంబాడ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు సంజీవ్ నాయక్, యాదవ జేఏసీ కన్వీనర్ మేకల రాములు యాదవ్, బీసీ జేఏసీ రాష్ట్ర కో కన్వీనర్ గుండెబోయిన అయోధ్య యాదవ్, బీసీ జర్నలిస్టుల ఫోరం ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.




## ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య

**అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి**

పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కావడిపల్లి గ్రామ శివారులో జరిగిన ఆత్మహత్య ఘటనపై ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి వివరాలు తెలియజేశారు. ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం – హైదరాబాదు నగరంలోని షేక్‌పేట్, రాయదుర్గ ప్రాంతం బిజెఆర్ నగర్‌కు చెందిన బొర్రా నరేష్ (22) అనే యువకుడు ఆర్థిక ఇబ్బందులు, మానసిక ఆందోళనల కారణంగా ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.మృతుడి అన్న బొర్రా నవీన్ (24) ఫిర్యాదు మేరకు 29.09.2025న నరేష్ తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తాను దుబాయ్ వెళ్తున్నాను, మూడు నెలల పాటు తిరిగి రాను అని చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. అనంతరం అతని మొబైల్ ఫోన్ కనెక్ట్ కాలేదు. దీంతో నవీన్ రాయదుర్గ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ,వ్యక్తి మిస్సింగ్ కేసు (Cr.No.1070/2025)గా నమోదు చేశారు. ఈ రోజు (18.10.2025) ఉదయం 10.30 గంటల సమయంలో కావడిపల్లి గ్రామ పరిధిలో ఎరుపు రంగు టీషర్ట్, తెల్లని నైట్ ప్యాంట్, నల్లని షూస్ ధరించిన వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని మృతిచెందినట్టు సమాచారం అందిందని, ఆ స్థలానికి పోలీసులు చేరుకుని పరిశీలించగా మృతుడు బొర్రా నరేష్‌గా గుర్తించారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ప్రాథమిక విచారణలో నరేష్ ఆర్థిక ఇబ్బందుల కారణంగా మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నాం. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నాం అని అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు.

## ఏసీబీకి పట్టుబడిన ట్రాన్స్ కో ఏఈ

**రూ. 30000 తీసుకుంటుండగా పట్టివేత**

రాజేంద్రనగర్, విశాలభారతి :

ట్రాన్స్కో ఏఈ అమర్ సింగ్ రూ. 30, 000 లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. కేసు వివరాలను హైదరాబాద్ రేంజ్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. బండ్లగూడ మున్సిపాలిటీలోని పీరం చెరువులో గంధంగూడ సబ్ స్టేషన్ హిమాయత్ సాగర్ సెక్షన్ ట్రాన్స్కో కార్యాలయం ఉంది. ఓ అపార్ట్మెంట్ వద్ద ట్రాన్స్ఫర్మర్ ఏర్పాటు కోసం ఏ ఈ అమర్ సింగ్ 30000 రూపాయలు లంచం డిమాండ్ చేశాడు. శనివారం సాయంత్రం తన కార్యాలయంలో డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వ్యూహాత్మకంగా పట్టుకున్నారు. నిందితుడు పై కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించారు.



# దాహన సంస్కరణలకు ఆర్థిక సహాయం

**వాజేడు, విశాలభారతి:**

ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని చింతూరు గ్రామానికి చెందిన పేట నాగేష్ (37) అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాని కాంగ్రెస్ సీనియర్ నాయకులు బంధం కృష్ణ పరామర్శించారు. కుటుంబానికి మనో ధైర్యం పెంపొందించారు. దాహన సంస్కరణ నిమిత్తం 3000 రూపాయలు అందజేసి పెద్దకర్మలకు తమ వంతు సహకారం అందిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. కుటుంబ పెద్ద కోల్పోవడం చాలా బాధాకరం కానీ పిల్లలను ఆలోచించి మనోధైర్యంతో ముందుకు సాగాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బీసీ సంఘం ములుగు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లగాసి రమేష్ కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు ములకల నరసమ్మ కాంగ్రెస్ నాయకులు చిట్యాల రాంబాబు అరికెళ్ల రఘుపతి చిట్యాల బతకయ్య గుద్దేటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ బంద్ విజయవంతం

**స్వచ్ఛందంగా సహకరించిన వ్యాపారులు**

**తిరుమలగిరి, విశాలభారతి:**



స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు చట్టబద్ధత కల్పించి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ జేఏసీ ఆధ్వర్యంలో తిరుమలగిరి మండల కేంద్రంలో వివిధ రాజకీయ పార్టీలు, బీసీ కుల సంఘాలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల, బిఆర్ఎస్,కాంగ్రెస్ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర బంద్ ను విజయవంతం చేయడం జరిగిందని, ఈ బందుకు మండలంలోని విద్యాలయాలు, వ్యాపార సంస్థలు, వాణిజ్య సంస్థలు, వీధి వ్యాపారులు, కార్మికులు, కర్షకులు, వివిధ కులవృత్తిదారులు స్వచ్ఛందంగా సహకరించి విజయవంతం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ కమిటీ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర రైతు సంక్షేమ సమితి సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్ హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం రాష్ట్రంలో కులగణన చేయడం జరిగిందని, 42 శాతం రిజర్వేషన్ల అమలు పరచడంలో దృడ సంకల్పంతో ఉందని అన్నారు. బీసీ లోని అన్ని కులాలు రిజర్వేషన్లు సాధించడం కోసం కలిసి రావడం ఒక శుభా పరిణామమని అన్నారు. రిజర్వేషన్లు అమలు అయితే బీసీ లోని అన్ని వర్గాల వారికి అన్ని రంగాల్లో మంచి అవకాశాలు దక్కుతాయని అన్నారు. అదేవిధంగా తిరుమలగిరి చౌరస్తాలో మహాత్మ జ్యోతిబాపూలే పూలే విగ్రహాన్ని ఆవిష్కరించి ఘనంగా పూలమాలలతో నివాళులర్పించడం జరిగింది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు ఎల్సోజు నరేష్, మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్ కుమార్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తన్నీరు రామ్ ప్రభు, సామాజిక తెలంగాణ మహాసభ రాష్ట్ర కన్వీనర్ కొత్తగట్టు మల్లయ్య, బిజెపి జిల్లా నాయకులు వై. దిన దయాల్, సిపిఐ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఎల్లంల యాదగిరి, గిలకత్తుల రాము గౌడ్, చేను శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ నాయకులు కందుకూరి సోమయ్య, కందుకూరి లక్ష్మయ్య, కందుకూరి ప్రవీణ్, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

**కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి**

**ఎల్బీనగర్, విశాలభారతి:**

బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గాయత్రీ నగర్ ఫేస్ 2 కాలనీ నూతన కార్యవర్గం ఏర్పడిన సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు బి.యన్. రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ని తన కార్యాలయంలో కలిసి కాలనీలో అభివృద్ధి మరియు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కార్పొరేటర్ కి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ గారు నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ త్వరలోనే కాలనీలో ప్రతి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చర్యలు చేపడతామని కాలనీవాసులకు హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు చందన్ నాయక్, ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ, ట్రెజరర్ శరత్ బాబు, ఉపాధ్యక్షులు నవీన్ కుమార్, సుధాకర్, జాయింట్ సెక్రటరీ గణేష్ యాదవ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ మల్లేష్ గౌడ్, లీగల్ అడ్వైజర్ చంద్రశేఖర్, శంకర్, కార్యవర్గ సభ్యులు ఖాజా హుస్సే, ఏడుకొండలు, బుర్రహుద్దీన్, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

# ఏఎంసీ సెంటర్ ఆకస్మిక తనిఖీ

**ఐకెపి సెంటర్లలో నిర్లక్ష్యం వహించద్దు ఆర్డిఓ నాగిరెడ్డి**



చౌటుప్పల్, విశాలభారతి: మండలంలోని ఐకెపి నిర్వహిస్తున్న ఏఎంసీ సెంటర్ను చౌటుప్పల్ ఆర్డీవో నాగిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐకెపి సెంటర్లో తొందరగా కొనుగోలను ప్రారంభించాలని రైతులకు ఎటువంటి ఇబ్బందులు జరగకుండా చూడాలని ఏఈఓ లను సమయానికి మ్యాచ్ తీసి మ్యాచరు వచ్చినటువంటి ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లుకు పంపించాలని తెలియజేయడం జరిగింది. ఎవరు కూడా నిర్లక్ష్యం వహించొద్దని ఎప్పటికప్పుడు రైతులకు ముందస్తు సమాచారాన్ని తెలియజేయాలని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సిసి నరసింహ,కమిటీ సభ్యులు ఏఎంసీ సెక్రటరీ పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



**తిరుమలగిరి, విశాలభారతి :**

లయన్స్ క్లబ్ తిరుమలగిరి ఆధ్వర్యంలో నాగారం మండలం, మామిడి పల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల లో లయన్ బొడ్డు సుందర్ ఆర్థిక సహాయం తో విద్యార్థుల కు టై, బెల్టులు గ్రామీణ వైద్యుడు మురళి మామిడి పెల్లి సహాయంతో ఐడెంటి)కార్డ్స్ పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమం లో లయన్ క్లబ్ అధ్యక్షులు డా. మురళీధర్, సెక్రటరీ డా రమేష్ నాయక్, క్లబ్ ట్రెజరర్ బి సుందర్, జలగం రామచంద్రన్ గౌడ్, కృష్ణమాచారి, గిరి గౌడ్, నాగచారి, మురళీ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

## లక్కారం చెరువును పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

**ఆకుల ఇంద్రసేనారెడ్డి వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్**

**చౌటుప్పల్, విశాలభారతి:**


పట్టణ కేంద్రంలోని లక్కారం చెరువును పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ జి. వెంకట్రాంరెడ్డి మరియు చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ & బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి,ఇరిగేషన్ శాఖ ఇ.రాజవర్ధన్ రెడ్డి కలిసి లక్కారం చెరువును పరిశీలించడం జరిగింది.లక్కారం చెరువు దాదాపు గా పూర్తిగా నిండి చిన్న అలుగు పోయడం జరుగుతుంది.చెరువు కట్ట పగుళ్లు పరిశీలించారు.కట్టకు ఎలాంటి ప్రమాదం లేకుండా తక్షణమే మరమ్మత్తు పనులు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ సైదులు గౌడ్,ముదిరాజు సంఘం అధ్యక్షుడు పాశం శ్రీనివాస్,పాశం కృష్ణ,పాశం అంజయ్య, పాశం వెంకటేష్,దొమ్మటి దయాకర్ రెడ్డి ,కానుగు పాండు,ఎర్ర శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



# సీఎం సహాయనిధి చెక్కు అందజేత

- ఉబ్బు వెంకటయ్య మార్కెట్ కమిటీ చైర్మన్
- మునుగోడు ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్

**చౌటుప్పల్, విశాలభారతి:**



మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో చౌటుప్పల్ పట్టణ పరిధిలో గల 12వ వార్డు చెందిన గడ్డిపాటీ లక్ష్మీనారాయణ కి 1,50,000 వేల రూపాయలు సీఎం సహాయ నిధి చెక్కును చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య , మునుగోడు ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్ వారికి కుటుంబానికి అందజేయడం జరిగినది. తదనంతరం పలువురు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని అందులోని భాగమే సీఎం సహాయనిధి,ఇది ఒక పేద ప్రజల ఓరమని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సుర్వి నర్సింహ గౌడ్,కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బతుల విప్లవ కుమార్ గౌడ్,మాజీ కౌన్సిలర్ బొడిగె అరుణ బాలకృష్ణ గౌడ్,వర్కాల రవి గౌడ్, గంగ రాములు, శ్రీకాంత్ గౌడ్ మరియు పాల్గొన్నారు.

# ఉప్పల్ డిపో ముందు బంద్

**మేడిపల్లి, విశాలభారతి:**

మేడిపల్లి మండలం ఉప్పల్ బస్ డిపో ఎదురుగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని మేడిపల్లి మండల సిపిఐ పార్టీ మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రచ్చ కిషన్ మరియు బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు బాపిరాజులు మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై ప్రభుత్వం విడుదల చేసిన జీవో 9 పై హైకోర్టు స్టే విధించడానికి నిరసనగా బీసీ రిజర్వేషన్లను రాజ్యాంగంలోకి షెడ్యూల్ 9లో లో చేర్చాలని డిమాండ్ చేస్తూ సిపిఐ పార్టీ బందును నిర్వహించడం జరిగినది. బంద్ ఫర్ జస్టిస్ పేరుతో నిర్వహిస్తున్నామని ఎలక్షన్ నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత స్టే ఇవ్వడం సుప్రీంకోర్టు తీర్పు వ్యతిరేకం అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు జిల్లా మహిళా సమైక్య కార్యదర్శి జే లక్ష్మి మండల సహాయ కార్యదర్శిలు సిహెచ్ మాధవి, జి నాగరాజు డిహెచ్పిఎస్ జిల్లా కార్యదర్శి దండు రమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి అన్వర్, బీసీ సంఘం జిల్లా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా శ్రీ చైతన్య ఒకేషనల్, పారామెడికల్ కాలేజ్ ఫ్రెషర్స్‌డే

**మహబూబాబాద్, విశాలభారతి:**



శ్రీ చైతన్య ఒకేషనల్ ఎస్.బి.ఎన్.ఆర్ పారామెడికల్ కాలేజీలో ఫ్రెషస్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు స్థానిక మహబూబాబాద్ పట్టణంలో పేరాల కట్టయ్య ఫంక్షన్ హాల్ లో శ్రీ చైతన్య ఒకేషనల్ అండ్ పారామెడికల్ విద్యార్థుల స్వాగత వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వైద్యాధికారి డిఎంహెచ్ఓ రవి రాథోడ్ హాజరై విద్యార్థులక వృత్తి విద్య కోర్సులు పట్ల అవగాహన కల్పిస్తూ పాటించవలసిన నియమాలను గురించి వివరిస్తూ తమ వద్దకే ఉద్యోగాలకు వస్తారు మంచి నైపుణ్యాలు నేర్చుకోండి అని చూసిస్తూ విద్యార్థులను ఎంతో ఉత్సాహపరిచారు. కోర్సులలో నర్సింగ్, ల్యాబ్ టెక్నీషియన్ కోర్సుల్లో ఉన్నతమైన మార్కులు సాధిస్తే తమ నోటిఫికేషన్ ఇచ్చినప్పుడు చైతన్య కాలేజీకి ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తానని మాట ఇచ్చారూ అలాగే స్థానిక సిపిఐ జిల్లా లీడర్ నల్లు సుధాకర్ రెడ్డి, ఈ కార్యక్రమానికి హాజరై విద్యార్థులను ఉద్దేశించి విలువలతో కూడిన సదువులు జీవితాలకి ఒక మంచి బుక్ మాదిరిగా అవుతాయని క్రమశిక్షణ లేని చదువు తగిన గాలిపటంలా ఉంటుందని ఎగ్జాంపుల్ తో వివరించారు. విద్యార్థులు చాలా శ్రద్ధగా విని రెస్పాండ్ అయ్యారు కళాశాల చైర్మన్ చల్లగాలి మోజేష్ విద్యార్థులను ఉద్దేశించి గొప్పగా మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులను మరియు రెగ్యులర్గా కాలేజీకి వచ్చిన విద్యార్థులకు బహుమతులను వివిధ కళలు ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ వేడుకల్లో కళాశాల వయసు ప్రిన్సిపాల్ తిరుమలేష్ సీనియర్ అధ్యాపకులు శ్రీనివాస్ రెడ్డి సురేందర్, విజయ్ కళావతి, ప్రసాద్, పాల్గొని విద్యార్థులు కు మంచి నడవడిక సూచిస్తూ సిబ్బంది మరియు విద్యార్థులు కలిసి డాన్సులు వివిధ కార్యక్రమాలతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో 2023-24 నుండి 2025-26 విద్యా సంవత్సరాల వరకు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమం శనివారం రోజు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (MPDO) కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి మండల విద్యా అధికారి (MEO) ఎన్. జగదీశ్వర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేసి సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన డీఈ ఇంద్రసేన రెడ్డి కి, ఎంఈఓ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద అంబర్పేట్ మున్సిపల్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, జీ హెచ్ఎంలు రమేష్‌కుమార్, జయత్‌రామ్, విజయభాస్కర్, అలాగే ఎంఆర్‌సీ సిబ్బంది మహేశ్, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రిజర్వేషన్ బిల్లును చట్టం చేసేంత వరకు పోరాడుతాం

**బయ్యారంలో విజయవంతమైన బంద్**

**బయ్యారం, విశాలభారతి:**

తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం బీసీ సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన బంద్ కార్యక్రమం బయ్యారం మండల కేంద్రంలో విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్త వినయ్ బాబు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు, న్యూ డెమోక్రసీ మాస్ లైన్ పార్టీ నాయకులు, సిపిఎం పార్టీ నాయకులు, న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు, సిపిఐ పార్టీ నాయకులు, కుల సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి




**దేవరుప్పుల, విశాలభారతి:** బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో దేవరుప్పుల మండలకేంద్రంలో బిసిబంద్ లో పాల్గొని ర్యాలీ నిర్వహించిన అఖిలపక్ష నాయకులు. అఖిలపక్షం పిలుపు మేరకు వ్యాపారస్తులు సంపూర్ణంగా మద్దతు తెలిపి తమ దుకాణాలను మూసివేశారు.ఈ సందర్భంగా వాళ్ళు మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కేటాయిస్తూ జారీ చేసిన జీఓ నంబర్ 9ని సుప్రీంకోర్టు,హైకోర్టులు కొట్టివేయడం ప్రజా వ్యతిరేకమని,అభివృద్ధి నిరోధకమని,వెనుకబడిన వర్గాలను ఇంకా వెనక్కి నెట్టేసేదిగా ఉన్న ఈ తీర్పులను తీవ్రంగా నిరసిస్తున్నామని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు తమ పోరాటం ఆగదని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్,కాంగ్రెస్ బిసిసెల్ అధ్యక్షుడు కాడబోయిన గణేష్,సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సింగారపు రమేష్,సీపీఐ మండల కార్యదర్శి జీడి ఎల్లయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పడమటింటి నరసింహ,ఆయా పార్టీల నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

**బీసీ రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లాలి**



**చౌటుప్పల్, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ కల్పిస్తూ జీవోను రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయానికి అఖిలపక్ష బీసీల సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర బంద్ పిలుపు మేరకు పూర్తి మద్దతు ప్రకటించి చౌటుప్పల మున్సిపల్ కేంద్రంలో బందును విజయవంతం చేయడం జరిగినది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మునుగోడు నియోజకవర్గ ఇంచార్జ్ బడుగు లక్ష్మయ్య మాట్లాడుతూ బీసీల జనాభా ప్రకారంగా 42శాతం స్థానిక సంస్థల్లో ఎన్నికలలో పాల్గొనుటకు అవకాశం కల్పించాలని ప్రభుత్వం చర్య తీసుకోవాలని అన్నారు. ఈ రిజర్వేషన్ ఆధారంగానే ఎన్నికల్లోకి వెళ్లాలని బీసీల జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటం అభినందనీయం. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు నల్ల పర్వతాలు యాదవ్,మారగొని అశోక్ గౌడ్,పట్టణ టిడిపి అధ్యక్షులు సుంకరి జంగయ్య గౌడ్,సీనియర్ నాయకుడు యాట వెంకటేష్ ముదిరాజ్,మండల కార్యనిర్వా కార్యదర్శి తడక కోటేశ్వర్,పట్టణ టిడిపి ఉపాధ్యక్షులు గోష్క పాండు,పట్టణ ప్రధాన కార్యదర్శి చిలువేరు రాజు,మండల కార్యవర్గ సభ్యులు చెరుకు అశోక్ గౌడ్,పట్టణ యువత అధ్యక్షులు బోదుల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

**బంద్‌లో పాల్గొన్న బీజేపీ శ్రేణులు**

**తొర్రూర్, విశాలభారతి:** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పిలుపు మేరకు బీసీ జేఏసీ చేపట్టిన రాష్ట్ర బంద్ కు తొర్రూరు పట్టణంలో చేపట్టిన బంద్ కార్యక్రమంలో బిజెపి శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.స్థానిక గెస్ట్ హౌస్ నుండి బైక్ ర్యాలీ నిర్వహించి పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న వ్యాపార, వాణిజ్య సంస్థలు మరియు వివిధ రకాల సంస్థలను బంద్ చేయించడం జరిగింది. ఈకార్యక్రమంలో బీజేపీ తొర్రూరు అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్, రూరల్ మండలం అధ్యక్షుడు గట్టు రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు పల్లె కుమార్, జిల్లా కార్యదర్శి (మాజీ) కౌన్సిలర్ కొలుపుల శంకర్, అలిసేరి రవిబాబు,రాయపురం రాజ కుమార్,గడల శేఖర్,కాగు నవీన్, అర్బన్ ప్రధాన కార్యదర్శులు నడిగడ్డ సందీప్, పప్పుశెట్టి సంతోష్,గంధం రాజు,నూకల నవీన్, జలగం రవి,నర్కుటి ఛలపతి రాజ్,తూర్పాటి సాయి ముకేష్,కుమ్మరికుంట్ల శ్రీకాంత్, శ్రీనివాస్ చారి, నడిగడ్డ ఉపేందర్,తాడిశెట్టి నవీన్,మచ్చ ఉదయ్,బొల్లు ప్రవీణ్,మాదగాని వరుణ్, సిహెచ్.శ్రీనివాస్,శోభ తదితరులు పాల్గొన్నారు.



**బీసీ బందుకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు**



**దేవరుప్పుల, విశాలభారతి:** స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కేటాయించాలని కోరుతూ బీసీ సంఘాలు పిలుపునిచ్చిన బందుకు సింగరాజుపల్లిలో బిఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఇచ్చి గ్రామ కేంద్రంలోని షాపులు ప్రైవేటు కార్యాలయాలను పాఠశాలలను బంధు చేయించారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ కార్యకర్తలు గ్రామ పార్టీ అధ్యక్షుడుతో కలిసి మాట్లాడుతూ, బీసీలకు రిజర్వేషన్ను పెంచడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని, దానికి రాష్ట్ర ప్రభుత్వం సర్వే పేరుతో ముస్లింలను బీసీలుగా చూపించి దొంగ నాటకం ఆడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయలేని కారణంగా, తెలంగాణ రాష్ట్ర ప్రజలను మభ్య పెట్టేందుకే స్థానిక సంస్థలు 42 శాతం రిజర్వేషన్ పేరిట బీసీలను మోసం చేస్తున్నదని, ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ స్థానిక సంస్థలు లాభం చేకూర్చుకోవాలని, దురుద్దేశంతో పనిచేస్తుందని, శాసనసభల్లో బీసీలకు సరైన విధంగా బిల్లును ప్రవేశ పెట్టి అమలు చేసి ముస్లింలను కలపకుండా పంపినట్లయితే కేంద్రం కూడా దానిని ఆమోదిస్తుందని, అన్నారు. ఈ కార్యక్రమంలో మేకపోతుల నరసింహ గౌడ్, అన్నారపు స్వరూప యాదగిరి, కత్తుల సోమిరెడ్డి, కొమ్ము రామచందర్, గడ్డం రాజు, కొండ చిన్న బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

**బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి**

**కూకట్ పల్లి, విశాలభారతి:** బీసీ రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలనీ, బీసీ జర్నలిస్ట్ అసోసియేషన్ (జేఏసీ)సభ్యులు తొట్ల పరమేష్, కొహీర్ నాగరాజు, దాదే వెంకట్ తేళ్ల హరికృష్ణలు అన్నారు. తెలంగాణ లో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్ల కోసం విడుదల చేసిన జీవోకు చట్టబద్ధత కల్పించి స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించాలని కోరుతూ, శనివారం చేపట్టిన బీసీ బంద్ కార్యక్రమంలో భాగంగా, కేపీహెచ్ బీ రోడ్ నెంబర్ వన్, గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ, బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో, జీవో నెంబరు 9 ను విడుదల చేసి ఎన్నికలకు సిద్ధం కాగా కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా చట్టబద్ధత కల్పించకుండా తాత్సారం చేస్తుందని విమర్శించారు. “తెలంగాణలో బీసీ వర్గాల సంక్షేమం కోసం జర్నలిస్టులు ఫ్రంట్ లైన్‌లో పనిచేసి సాధించిన విజయాలు గుర్తించాలన్నారు.



విశాల భారతి Real Talk
రియల్ టాక్
vishalabharati Telugu Daily
విశాల భారతి
www.vishalabharati.com
epaper.vishalabharati.com


మెట్రో నగరాల్లో లగ్జరీ హోమ్స్ ఎవర్ గ్రీన్ ప్రాజెక్టులుగా నిలుస్తున్నాయి. కాలానుగుణంగా మారుతున్న అభిరుచులకు తగినట్లుగా సువిశాలమైన ఇండ్లకు కొనుగోలుదారులు ప్రాధాన్యతనిస్తున్నారు. ముఖ్యంగా కరోనా తర్వాత లగ్జరీ ఇండ్ల ట్రెండ్ అన్ని మెట్రో నగరాలకు శరవేగంగా విస్తరించింది. ఇక అప్పటి నుంచి లగ్జరీ ప్రాజెక్టుల నిర్మాణంలో హైదరాబాద్ అన్ని మెట్రో నగరాలకు ధీటుగా నిలుస్తోంది. సంపన్న వర్గాలు కూడా ఈ తరహా ప్రాజెక్టులను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. హెచ్ఎన్ఐ వర్గాలకు అనువైన లగ్జరీ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తూనే ఉన్నాయి. అత్యధిక ఆదాయ వనరులు, బడా వ్యాపారవేత్తలు, విదేశీయులతో, ప్రవాసీయులు హై ఎండ్ విలాసవంతమైన గృహాలను కొనుగోలు చేసే జాబితాలో ఉన్నారు. దీంతో బిల్డర్లు కూడా ఈ తరహా ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రాధాన్యత చూపుతున్నారు. ఇలా శివారులోని కోకాపేట్, తెల్లాపూర్, నార్సింగి, మంచిరేవుల వంటి ప్రాంతాలతోపాటు, నగరంలోని జూబ్లీ హిల్స్, బంజారాహిల్స్, గచ్చిబౌలి, కొండాపూర్ వంటి ప్రాంతాల్లో ఉండే భారీ విస్తీర్ణంలో ఉండే బడా బంగ్లాలకు వేదికగా నిలిచాయి. ఆ ప్రాంతంలో పెరిగిన అధిక భూముల ధరలతో నగరం నలువైపులా విల్లా గేటెడ్ కమ్యూనిటీలు పుష్కళంగా అందుబాటులోకి వస్తున్నాయి. ముఖ్యంగా ఈస్ట్, నార్త్ సిటీ ప్రాంతాలు ఈ తరహా నిర్మాణాలకు ప్రధాన కేంద్రాలుగా నిలుస్తున్నాయి. ఇందులో వరంగల్ హైవే, అటు విజయవాడ ప్రధాన రహదారులన్నీ విల్లాలతో నిండిపోతున్నాయి. వీటిని కొనుగోలు చేసే వారికి అనుగుణంగా ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతూనే ఉంది. అయితే లగ్జరీ భవనాల ట్రెండ్ గడిచిన ఐదారేళ్లుగా హైదరాబాద్ అనూహ్యంగా పెరిగిన విషయం తెలిసిందే. దీంతో సాధారణ డబుల్ బెడ్రూం ఇండ్ల తరహాలో లగ్జరీ, స్పేసియస్ ప్రాజెక్టులలో ఇండ్లను కొనుగోలు చేసే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

# విల్లాసాల్లో తగ్గేదేలే

## భారీగా పెరిగిన లగ్జరీ ఇండ్లు

### సిటీ తర్వాతే బెంగుళూరు, పుణే నగరాలు

### సిటీ కేంద్రంగా జోరుగా లగ్జరీ ఇండ్ల అమ్మకాలు

### శివారు ప్రాంతాల్లో పుష్కళంగా విల్లా ప్రాజెక్టులు




## నిర్మాణ రంగంలో సమూల మార్పులు

కరోనా తర్వాత నుంచి నిర్మాణ రంగంలో సమూలమైన మార్పులు చోటుచేసుకున్నాయి. వర్క్ ఫ్రమ్ హోంకు అనుగుణంగా, విశాలమైన, విలాసవంతమైన గృహాలకు అనూహ్య స్పందన వచ్చింది. ఇక పెరుగుతున్న ఆదాయ, వ్యాపార అవకాశాలతో నగరంలో ఇండిపెండెంట్ లగ్జరీ ఇండ్లను కొనుగోలు చేసే సెగ్మెంట్ జనాలు మక్కువ చూపుతున్నారు. మార్కెట్‌తో సంబంధం లేకుండా లగ్జరీ ప్రాజెక్టుల విక్రయాలు గడిచిన ఐదారేళ్లుగా జోరుగా సాగుతున్నాయి. 2024 తర్వాత నగరంలో రూ.3 కోట్ల నుంచి అంతకంటే ఎక్కువ ధర కలిగిన లగ్జరీ హౌసింగ్ యూనిట్లను విక్రయించిన మెట్రో నగరాల జాబితాలో హైదరాబాద్ మూడో స్థానంలో నిలిచింది. ఈ సంవత్సరం నగరంలో విపరీతంగా విల్లా ప్రాజెక్టుల క్రయవిక్రయాలు సాగుతున్నాయి. వీటి మొత్తం విలువ గడిచిన రెండేళ్లలో రూ.15వేల కోట్ల పైనే ఉండగా... సీఆర్ఈ మ్యాట్రిక్ తాజాగా వెల్లడించిన నివేదికలోనూ తేలింది. ఇక దేశవ్యాప్తంగా ఉన్న ఏడు మెట్రో నగరాల్లో ముంబై మొదటి స్థానంలో ఉంటే, ఢిల్లీ-ఎన్సీఆర్ రెండో స్థానంలో బెంగుళూరు, చెన్నయ్, పుణే, కోల్ కతా నగరాలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా లగ్జరీ విల్లా మార్కెట్ విలువ కనీసం రూ. 60-75వేల కోట్లకు పైగా ఉంటుందనే గణాంకాలు చెబుతున్నాయి. గతేడాది కాలంగా దేశంలోని ప్రధానమైన ఏడు మెట్రో నగరాల్లో ఈ తరహా స్థిరాస్తుల అమ్మకాలు పెరుగుతూనే ఉన్నాయని ఇటీవల వెల్లడైన నివేదికలోనూ తేలింది. ఏడు ప్రధాన మెట్రో నగరాల్లో హై ఎండ్ లగ్జరీ ప్రాజెక్టులకు ఉన్న డిమాండ్ పెరుగుతుంది. ఈ ధరల పెరుగుదల కూడా రూ. 3కోట్ల నుంచి మొదలుకుని రూ. 100 కోట్లు పైబడి ఉన్నప్పటికీ సంపన్నులు ఈ తరహా ప్రాజెక్టులకు మొగ్గు చూపుతున్నారు. హై నెట్ వర్త్ కలిగిన వారు, ప్రవాసీయులు, వ్యాపారవేత్తలు, ఈ తరహా ప్రాజెక్టులను పెట్టుబడి మార్గాలు భావించడంతో క్రమంగా లగ్జరీ గృహాలు పెరగడానికి కారణం అవుతుందని రియల్ ఎస్టేట్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో గ్రేడ్-ఏ డెవలపర్లు ఆల్ట్రా లగ్జరీ ప్రాజెక్టులను మాత్రమే మార్కెట్లోకి తీసుకు వస్తున్నారు.

## రెసిడెన్షియల్ ప్రాజెక్టులకు డిమాండ్

హైదరాబాద్ నగరంలో ఇప్పటికీ రెసిడెన్షియల్ క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. నిత్యం ఆల్ట్రా మోడ్రన్ లగ్జరీ విల్లా ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతూనే ఉంది. బడా డెవలపర్ల తరహాలో సాధారణ బిల్డర్లు కూడా జాయింట్ వెంచర్లుగా ఈ తరహా ప్రాజెక్టులను చేపడుతున్నారు. దీనికి తోడు నగరంలో ఒకప్పుడు అపార్టుమెంట్లలో నివాసం ఉన్నవారు కూడా లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీ విల్లాలకు మారే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. దీంతో అపార్టుమెంట్ ప్రాజెక్టుల తరహాలో... ఆల్ట్రా మోడ్రన్ లగ్జరీ విల్లా ప్రాజెక్టులను చేపడుతున్నారు. ప్రస్తుతం కొత్త ప్రాజెక్టుల నిర్మాణం కొంత మేర తగ్గిన... నగర శివారుల్లో పదుల సంఖ్యలో ఆల్ట్రా లగ్జరీ విల్లా ప్రాజెక్టుల నిర్మాణం జోరుగా సాగుతున్నాయి. గడిచిన ఏడాదిన్నర కాలంలో అపార్ట్‌మెంట్లు, ప్లాట్లు, విల్లాలు సహా 75,512 నివాస లావాదేవీలు నమోదయ్యాయి. ఇది 2023లో నమోదైన 74,495 లావాదేవీల కంటే కొంచెం ఎక్కువ. నమోదైన గృహ అమ్మకాల విలువ గత సంవత్సరంతో పోలిస్తే 13 శాతం పెరిగి `45,190 కోట్లకు చేరుకుందని స్క్వేర్ యార్డ్స్ నివేదిక తెలిపింది. మైక్రోసాఫ్ట్ వంటి ప్రపంచ ఐటీ దిగ్గజాలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను విస్తరించడంతో నగరం యొక్క ఆకర్షణ పెరుగుతూనే ఉంది, ప్రపంచ పటంలో దాని స్థానాన్ని మరింత పటిష్టం చేస్తుంది. స్థానిక కొనుగోలుదారులు, ప్రొఫెషనల్ వృత్తిదారుల నుంచి కొనుగోలు ఎక్కువగా నమోదు అవుతుండగా... ఇందులో హైరేంజ్ మోడ్రన్ విల్లాలకు భారీ డిమాండ్ ఉందని వ్యాఖ్యానించింది. ఫోర్త్ సిటీ నిర్మాణం, అదనంగా 24 మునిసిపాలిటీల విలీనం, రీజనల్ రింగు రోడ్డు వరకు మౌలిక వసతుల కల్పనతో దేశంలోని అన్ని మెట్రో నగరాల కంటే హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో మరిన్ని పెట్టుబడులను ఆకర్షిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది.

## శివారులన్నీ విల్లాసాల కేంద్రాలే...

నగరంలో ఇబ్బడిముబ్బడిగా పెరిగిన జనసాంద్రత ఇప్పుడు శివారు ప్రాంతాలే ప్రధాన రెసిడెన్షియల్ ప్రాజెక్టులకు ఆవాసాలుగా మారాయి. ఇక క్రమంలో నగరంలో స్థిరపడిన వారు కూడా శివారుల్లో విలాసవంతమైన ఇండ్లలోకి చేరుతున్నారు. వీటికి అనుగుణంగానే అవుటర్ రింగు రోడ్డుకు ఇరువైపులా వందలాది విల్లా ప్రాజెక్టులు మార్కెట్లోకి వచ్చాయి. వెస్ట్ కారిడార్‌తో పోలిస్తే నగరం మూడు వైపులా భూముల ధరల మధ్య భారీ వ్యత్యాసం ఉంది. ఈ క్రమంలో నార్త్ వెస్ట్, నార్త్ ఈస్ట్, నార్త్ సిటీతోపాటు, ఈస్ట్ సిటీ ప్రాంతాలలో లగ్జరీ రెసిడెన్షియల్ ప్రాజెక్టులకు ప్రధాన కేంద్రంగా మారాయి. దీంతో ఉద్యోగ, వ్యాపార నిమిత్తం సిటీకి రాకపోకలు సాగిస్తున్న వారు కూడా శివారుల్లోని విల్లా ప్రాజెక్టులలోనే నివాసం ఉంటున్నారు. దీంతో వీరికి అనుగుణంగా నగరం నలువైపులా కూడా రియల్ ఎస్టేట్ కంపెనీలు కూడా ప్రాజెక్టులను అందుబాటు ధరల్లో చేపడుతూ కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నాయి. ఇలా ఏఎంఆర్ రియల్ ఎస్టేట్ కంపెనీ లెగసీ పేరిట తారామతి పేట్‌కు సమీపంలో, ఓఆర్ఆర్ ఎగ్జిట్ 10 వద్ద గౌరెల్లిలో ఆఫర్డబుల్ విల్లా ప్రాజెక్టులను చేపట్టింది. కేవలం రూ. కోటిన్నర విల్లాను అందిస్తోంది. 10 ఎకరాల విస్తీర్ణంలో 112 విల్లాలతో లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీని హెచ్ఎండీఏ అనుమతులతో చేపట్టింది. రేరా గుర్తింపుతో 2026నాటికి పూర్తయ్యే ఈ ప్రాజెక్టు ఆఫర్డబుల్ విల్లా ప్రాజెక్టులను కోరుకునే వారికి అనువుగా ఉంది. ఈసీఐఎల్ నుంచి కీసర వెళ్లే ప్రధాన మార్గంలో మార్గంలో సర్వీసు రోడ్డుకు ఆనుకుని ప్రముఖ నిర్మాణ సంస్థ హరిహర ఎస్టేట్స్ వసంత్ విల్లాస్ పేరిట 6 ఎకరాల విస్తీర్ణంలో లగ్జరీ లివింగ్ కోరుకునే వారికి వీలుగా 69 విల్లాలను అందిస్తోంది. 187 నుంచి 310 గజాల విస్తీర్ణంలో ఉండే ఒక్కో విల్లా 3వేల చదరపు అడుగుల నుంచి 3.7వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండే సువిశాలంగా ఉండేలా నిర్మిస్తోంది. ఇంటిలో ఉండే బాత్ రూంల నుంచి నిర్మాణ శైలి వరకు ఆధునాతన హంగులతో ప్రాజెక్టును చేపడుతోంది. వెస్ట్ సిటీ నుంచి శంషాబాద్ వెళ్లే మార్గంలో అప్పా జంక్షన్‌కు సమీపంలో ప్రముఖ నిర్మాణ సంస్థ శాంతాశ్రీరాం బ్రూక్ వుడ్ పేరిట లగ్జరీ ప్రాజెక్టును చేపడుతోంది. విస్తారమైన లంగ్ స్పేస్‌కు సమీపంలో, అవుటర్ రింగు రోడ్డుకు ఆనుకుని నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు ద్వారా అటు అంతర్జాతీయ ఎయిర్ పోర్టుతోపాటు, ఇటు ప్రతిపాదిత బుద్వేల్ ఐటీ పార్క్‌కు చేరవగా ఉండే ప్రాంతంలో 6 ఎకరాల విస్తీర్ణంలో సువిశాలమైన లగ్జరీ విల్లాలను అందిస్తోంది.

## నేను సెక్సీ కాదు..
# బోల్డ్ రోల్స్ నాకెవ్వరూ ఇవ్వలేదు

ఇండస్ట్రీలో సమంత స్టార్ హీరోయిన్ గా ఏ రేంజ్ కు ఎదిగిందో అందరికీ తెల్సిందే. గత కొంతకాలంగా ఆమె సినిమాలకు దూరంగా ఉన్నా కూడా ఆమె స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు అని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఇక కొంతమంది హీరోయిన్లు తమ తప్పులను ఒప్పుకోవడానికి కష్టపడుతుంటారు. కానీ, సామ్ అలా కాదు.. తాను తప్పులు చేశాను అని బహిరంగంగా ఒప్పుకుంది.ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్ లో పాలుపంచుకున్న సమంత తన మనసులోని భావాలను ఏ మాత్రం దాచుకోకుండా చెప్పుకొచ్చింది. తన కెరీర్ బిగినింగ్ నుంచి ఇప్పటివరకు తన జీవితంలో జరిగిన ప్రతి విషయం ప్రజలకు తెలిసేలాగే జరిగిందని, ట్రోల్స్ ఎన్ని వచ్చినా ఎదుర్కొని నిలబడినట్లు తెలిపింది. ప్రతి ఒక్కరికీ ఓ ఆశయమంటూ ఉండాలని, అందుకు తగ్గ సదుద్దేశం కూడా తోడవ్వాలని సమంత చెప్పుకొచ్చింది.ఇక సామ్ కెరీర్ ను మార్చిన విషయం పుష్ప లో ఐటెం సాంగ్ చేయడం. ఇది ఆమెపై ట్రోలింగ్ ను మరింత పెంచింది. నాగ చైతన్యతో విడాకులు తీసుకున్నాకా బయట ఎక్కడా కనిపించని సామ్.. ఊ అంటావా.. ఊఊ అంటావా సాంగ్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అది పూర్తిగా తన డెసిషన్ అని చెప్పుకొచ్చింది. ఇప్పటివరకు మూస పాత్రలు చేసి కొత్తగా ఏదైనా చేయాలనుకున్నప్పుడు ఈ సాంగ్ ఆఫర్ వచ్చిందని, ఐటెంసాంగ్ చేస్తే ఎలా ఉంటుందో చూడడానికే ఆ సాంగ్ చేసినట్లు తెలిపింది.





ప్రభాస్ హీరోగా మారుతీ డైరెక్షన్ లో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టి.జి. విశ్వప్రసాద్ నిర్మించిన 'ద రాజాసాబ్' మూవీ పలు రిలీజ్ డేట్స్ మార్చుకుంది. ప్రస్తుతం సంక్రాంతి కానుకగా జనవరి 9వ తేదీన 'ద రాజాసాబ్' రానుందని వినిపిస్తోంది. అయితే ఈ డేట్ కూడా మారే అవకాశం ఉందని, ఈ సినిమా ఏకంగా సమ్మర్ కు షిఫ్ట్ అవుతోందని ఓ టాక్ వినిపిస్తోంది. దీంతో ప్రభాస్ ఫ్యాన్స్ అయోమయంలో పడ్డారు.


# 'ది రాజా సాబ్'.. మళ్ళీ వాయిదా?

ఎందుకంటే ఈ సినిమాతో పాటు ప్రభాస్ అంగీకరించిన చిత్రాల పరిస్థితి ఏంటనీ అభిమానులు తికమకలో ఉన్నారు. అయితే ప్రభాస్ ఓ పక్కా ప్రణాళికతో ముందడుగు వేస్తున్నారని కాబట్టి ఏ లాంటి ఆందోళన చెందవలసిన పనిలేదని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

## రశ్మిక మందణ్ణ
# 'థామా' రన్ టైమ్ ఎంతంటే...

రశ్మిక మందణ్ణ, ఆయుష్మాన్ ఖురానా నటిస్తున్న 'థామా' సినిమా ఈ నెల 21న విడుదల కాబోతోంది. దీనికి సెన్సార్ అధికారులు యు/ఎ సర్టిఫికెట్ ఇచ్చారు. బాలీవుడ్ క్రేజీ హీరో ఆయుష్మాన్ ఖురానా, నేషనల్ క్రష్ రశ్మిక మందణ్ణ నటిస్తున్న 'థామా' సినిమా పాన్ ఇండియా స్థాయిలో దీపావళి కానుకగా ఈ నెల 21న జనం ముందుకు రాబోతోంది. ఇటీవల సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ హారర్ మూవీకి 'యు/ఎ' సర్టిఫికెట్ లభించింది. పెద్దలతో కలిసి పిల్లలు చూసే ఆస్కారం ఉన్న ఈ సినిమా 16 సంవత్సరాల పైబడిన వారిని ఉద్దేశించిందనే అభిప్రాయం వ్యక్తం చేసింది సీబీఎఫ్సీ.





# సూర్య 'కరుప్పు' ఫస్ట్ సింగిల్‌కు డేట్ ఫిక్స్!

తమిళ స్టార్ హీరో సూర్య నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'కరుప్పు' ఇప్పటికే శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాను ఆర్.జె.బాలాజీ డైరెక్ట్ చేస్తుండటంతో ఈ మూవీపై ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ అయింది. ఇక ఈ సినిమా నుంచి రిలీజ్ అయిన పోస్టర్స్ ఈ బజ్‌ను మరింత పెంచాయి.అయితే, దీపావళి కానుకగా ఈ చిత్రం నుండి ఓ సాలిడ్ ట్రీట్ ఇస్తున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ సాంగ్‌ను దీపావళి కానుకగా అక్టోబర్ 20న రిలీజ్ చేస్తున్నట్లు చిత్ర యూనిట్ తాజాగా ప్రకటించింది.సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలోని మ్యూజిక్ ఎలా ఉండబోతుందా అని ప్రేక్షకులు ఆసక్తిగా చూస్తున్నారు. ఈ చిత్రాన్ని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్ ప్రొడ్యూస్ చేస్తున్నారు

## 'నీవే నా తొలి ప్రేమ'
# తెలుగు ఆల్బమ్ సాంగ్స్ లాంచ్

**హైదరాబాద్, విశాలభారతి,**

ప్రేమ, విరహం వంటి సున్నితమైన అంశాలతో యువతరాన్ని లక్ష్యంగా చేసుకొని రూపొందించిన అద్భుతమైన ప్రైవేట్ మ్యూజికల్ ఆల్బమ్ తెలుగు వెర్షన్ "నీవే నా తొలి ప్రేమ" ను హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. 'లవ్ అండ్ బ్రేకప్' అనే థీమ్‌తో, హృదయాన్ని హత్తుకునేలా ఈ ఆల్బమ్ రూపొందించిన ఈ థీమ్ సాంగ్స్ ను ప్రముఖ డైరెక్టర్, తెలుగు సినిమా డైరెక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వీరశంకర్ తోపాటు ప్రముఖ సినీ సంగీత దర్శకులు భోలే షావాలి వేర్వేరుగా ఆవిష్కరించారు. ప్రముఖ డైరెక్టర్, తెలుగుసినిమా డైరెక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వీరశంకర్ మాట్లాడుతూ.."వెన్ ల్యాక్స్ టీమ్ అంతా చాలాబాగా వర్క్ చేసింది. పెద్ద సినిమాల్లో పాటల్లా ఎంతో క్వాలిటీతో చేశారు. ముఖ్యంగా ఈ పాటలు యువతతోపాటు అన్ని వయసులవారిని ఆకట్టుకునేలా ఉన్నాయి" అని అన్నారు. ఈ సందర్భంగా సంగీత దర్శకులు భోలే షావాలి మాట్లాడుతూ, "యూత్‌కు కనెక్ట్ అయ్యే మంచి మ్యూజిక్, ఎమోషనల్ కంటెంట్‌తో ఈ ఆల్బమ్ రూపొందించడం చాలా సంతోషకరం. ఈ పాటల్లో మాంచి లవ్ స్టోరీ ఫీల్ ఉంది. "వెన్ ల్యాక్స్ ప్రొడక్షన్స్" అండ్ వెన్ ల్యాక్స్ మ్యూజిక్స్ పతాకంపై నిర్మించిన ఈ పాటలు కచ్చితంగా ప్రేక్షకులను అలరిస్తాయి. యువ ప్రతిభను ప్రోత్సహించిన నిర్మాతలకు, దర్శకుడికి నా అభినందనలు," అని భోలే షావాలి అన్నారు. ఈ ఆల్బమ్‌లో యంగ్ టాలెంటెడ్ ఆర్టిస్టులు హరీష్‌దాచేపల్లి, సాయి నీరజ ప్రధాన పాత్రల్లో నటించారు. జగదీష్ కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా లవర్ పాత్రలో హరీష్ దాచేపల్లి నటన, భావోద్వేగాలను పలికించిన తీరు ఎంతో సహజంగా, హృదయానికి హత్తుకునేలా ఉందని యూనిట్ సభ్యులు తెలిపారు.

**సాంకేతిక వర్గం..**

ఈ ఆల్బమ్‌కు ప్రముఖ సినీ దర్శకుడు తాజుద్దీన్ దర్శకత్వం వహించడంతో పాటు, పాటలకు అద్భుతమైన సాహిత్యాన్ని కూడా అందించారు. సమర సింహ అందించిన సినిమాటోగ్రఫీ ఈ పాటల విజువల్స్‌ను మరింత గ్రాండ్‌గా, ఎక్సలెంట్‌గా తీర్చిదిద్దింది. ఎడిటింగ్, డీఐ బాధ్యతలను జగదీష్ కుమార్ నిర్వహించగా, ప్రశాంత్ ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేశారు. అలాగే, నరేష్, సందీప్ వంటి సాంకేతిక నిపుణుల కృషి ఈ ఆల్బమ్‌కు అదనపు ఆకర్షణగా నిలిచింది. మొత్తం మీద, వెన్ ల్యాక్స్ ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ "నీవే నా తొలి ప్రేమ" మ్యూజికల్ ఆల్బమ్ నేటి తరం యువ ప్రేక్షకులను, ముఖ్యంగా ప్రేమ విఫలమైన వారిని, తమ కథగా భావించేలా చేస్తుందని, తద్వారా ఈ పాట పెద్ద విజయం సాధిస్తుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే ఈ పాటలు అన్ని డిజిటల్ మ్యూజిక్ ప్లాట్‌ఫామ్‌లలో అందుబాటులోకి రానున్నాయని వెన్ ల్యాక్స్ ప్రొడక్షన్స్ అధినేత దాచేపల్లి హరీష్ వెల్లడించారు. ఈ లవ్ అండ్ బ్రేకప్ థీమ్ ఆల్బమ్ సాంగ్స్ రీల్స్ చేసేందుకు వీలుగా ఉంటాయని, అందుకోసం సెర్చ్ ఆప్షన్ ద్వారా ఈ సాంగ్స్ ను పొందడానికి 'నీవే నా తొలి ప్రేమ 'పేరుతో సెర్చ్ చేయవచ్చని ఆయన తెలిపారు.




Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.